నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 9-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 167 | పేజీలు:4 | వెల: రూ.1/-

పర్వతనేని రాజేశ్వర్‌రావుకు సీఎం కేసీఆర్ నివాళి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 : ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో సోదరి భర్త పర్వతనేని రాజేశ్వర్‌రావు(84) శనివారం ఉదయం కన్నుమూశారు. అల్వాల్ మంగాపురిలో రాజేశ్వర్‌రావు పార్థివదేహానికి సీఎం కేసీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను సీఎం కేసీఆర్ ఓదార్చారు. రాజేశ్వర్‌రావు మృతి వార్త తెలుసుకున్న మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు.. ఉదయమే మంగాపురికి చేరుకున్నారు. రాజేశ్వర్‌రావు పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇవాళ సాయంత్రం అల్వాల్‌లోనే రాజేశ్వర్‌రావు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

జేబీఎస్ - ఎంజీబీఎస్ మధ్య మెట్రో పరుగులు

ప్రయాణించేందుకు ఆసక్తి చూపిన ప్రజలు
ఉదయమే స్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులు

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): జేబీఎస్ – ఎంజీబీఎస్ మధ్య సిఎం కెసిఆర్ మెట్రో సేవలకు జెండా ఊపడంతో వనివారం ఉదయం 6:30 గంటల నుంచి మెట్రో రైళ్ల సేవలు ప్రారంభమయ్యాయి. జేబీఎస్ – ఎంజీబీఎస్ మార్గంలో మెట్రో రైళ్లు రాకపోకలు కొనసాగిస్తుండడంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచే ఈ మార్గంలో ప్రయాణికులు మెట్రో రైలును ఎక్కారు.

తమ ప్రాంతంలో సేవలు అందుబాటులోకి రావడంతో వివిధ ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్‌కు రోడ్డు మార్గంలో ప్రయాణించాలంటే సుమారు గంట సమయం పడుతుంది. ఈ మెట్రో అందుబాటులోకి రావడంతో 11 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 16 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం కలిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. జేబీఎస్, పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్, గాంధీ ఆస్పత్రి, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, నారాయణగూడ, సుల్తాన్ బజార్ మీదుగా ఎంజీబీఎస్‌కు మెట్రో రైళ్లు చేరుకోనున్నాయి. ఈ మార్గాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. జేబీఎస్ మెట్రోప్రాంగణంలో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం.. తర్వాత ఈ మార్గంలో మెట్రోరైలుకు పచ్చజెండా ఊపారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి మెట్రోరైలులో ఎంజీబీఎస్ వరకు ప్రయాణించారు. మధ్యలో చిక్కడపల్లి స్టేషన్‌లో రైలు దిగి ప్రజలతో ముచ్చటించారు. అక్కడి నుంచి ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌కు చేరుకొన్నారు. అక్కడ మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్రప్రభుత్వ, మెట్రో అధికారులతో సమావేశమయ్యారు. మెట్రోరైలు అధికారులు, ఇంజినీర్లు, సిబ్బందితో కలిసి ఫొటో దిగారు. ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్ నిర్మాణాన్ని, అక్కడినుంచి బస్‌స్టేషన్‌కు కనెక్ట్ చేసిన స్కైవాక్‌ను పరిశీలించారు. అక్కడి మౌలికవసతులపై ఆరాతీశారు. జేబీఎస్, ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్లు ఆధునిక విమానాశ్రయాలను తలపిస్తున్నాయని ప్రశంసించారు. మెట్రోస్టేషన్లు నిర్మించిన విధానం, వినియోగించిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సంతోషం వ్యక్తంచేశారు. మెట్రో రైలు తియ్యని ఫలాలను నగరవాసులు ఇప్పటికే అనుభవిస్తున్నారని, హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించడంతోపాటు నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చేందుకు నగరంలోని అన్ని ప్రాంతాలకు మెట్రోసేవలను విస్తరించేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని సూచించారు. దాదాపు 45 నిమిషాలపాటు ఎంజీబీఎస్ స్టేషన్‌లోనే ముఖ్యమంత్రి కేసీఆర్.. అనంతరం అక్కడినుంచి రోడ్డుమార్గాన వెళ్లిపోయారు. జేబీఎస్–ఎంజీబీఎస్ మెట్రోమార్గం అందుబాటులోకి రావడంతో హైదరాబాద్‌లో మెట్రో మొదటిదశ దాపు పూర్తయింది. నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్– మియాపూర్, జేబీఎస్– ఎంజీబీఎస్ మూడుమార్గాల్లో కలిపి మొత్తం 69 కిలోమీటర్ల అందుబాటులోకి వచ్చింది. ఢిల్లీ తర్వాత రెండో అతిపెద్ద ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రోరైలు ఖ్యాతి సంపాదించింది.

కరోనాతో సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తం

చైనా నుంచి బట్టలు,ఆహారపదార్థాల దిగుమతులపై నిషేధం

మణిపూర్, మిజోరాం రాష్ట్రాల నిర్ణయం

ఇంపాల్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): చైనాలో పుట్టిన కరోనా వైరస్ తో ప్రపంచ దేశాలు వణికిపోతున్నాయి. ఈనేపథ్యంలో చైనాకు ఆనుకుని ఉన్న మణిపూర్, మిజోరాం రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఆ రాష్ట్రాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. చైనా నుంచి దిగుమతి అయ్యే బట్టలు, ఆహార ఉత్పత్తులపై మణిపూర్, మిజోరాం రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాయి. ఈ నిషేధం నేటి నుంచే అమల్లోకి రాబోతోంది. అంతేకాదు చైనా, మయన్మార్ సరిహద్దుల్లో కరోనా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే చైనా నుంచి మిజోరాం, మణిపూర్ రాష్ట్రాలకు ఐదుగురు వ్యక్తులు వచ్చారు. వీరిని ఇంట్లోనే ఉంచి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారిని ఇంటి నుంచి బయటకు రానివ్వడం లేదు. ఇతరులెవరినీ వారితో కలవనీయడం లేదు. కాగా కరోనా వైరస్ బారిన ఇప్పటి వరకు దాదాపు 34 వేల మంది పడ్డారు. 700 మందికి పైగా చనిపోయారు.

చెత్తకుప్పలో పేలుడు

తప్పిన ముప్పు

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): నగరంలోని రాంనగర్‌లో చెత్తకుప్పలో పేలుడు సంభవించింది. ముషీరాబాద్ సమీపంలోని రాంనగర్‌లో చెత్తకుప్పలో ఉన్న కెమికల్ డబ్బా అకస్మాత్తుగా పేలింది. డబ్బా పేలుడుకు మంటలు చెలరేగి మంటలంటుకున్నాయి. ఈ ఘటనలో నాగయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నాగయ్య కుడిచేతి బాగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. చికిత్స నిమిత్తం నాగయ్యను గాంధీ ఆస్పత్రికి తరలించారు. నాగయ్య చెత్త కుప్పలో చెత్తను ఏరుకుంటుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గత నాలుగు రోజుల కిందటే ఈ ప్రాంతంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆ కార్డన్ సెర్చ్‌కు భయపడే ఏవరో ఈ డబ్బాను ఇక్కడ వేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన క్లూస్ టీం.. పేలుడుకు కారణమైన ఆ డబ్బాను ల్యాబ్‌కు పంపించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఢిల్లీ ఎన్నికల పోలింగ్

ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభం
ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్రపతి దంపతులు
ఓటేసిన పలువురు ప్రముఖులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ప్రశాంతంగా మొదలయ్యింది. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభం అయ్యింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఆయన భార్య సవిత కోవింత్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రపతి కార్యాలయంలోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వారిద్దరూ ఓటేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దంపతులు కూడా నిర్మాణ్ భవన్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 11న ఫలితాలు వెల్లడి కానున్నాయి. వివిధ రంగాల ప్రముఖులతో పాటు పౌరులు చురుగ్గా పోలింగ్‌లో పాల్గొన్నారు. భారత ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలోని నిర్మాణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సీఈసీ ఓటేశారు. ఈ స్థానం నుండే ప్రస్తుత ఎమ్మెల్యే, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బరిలో ఉన్నారు. ప్రత్యర్థులుగా బీజేపీ నుంచి సునీల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నుంచి రమేశ్ సబర్వాల్ బరిలో ఉన్నారు. ఎలక్షన్ కమిషనర్ సుశీల్ చంద్రా తన భార్య నీలూ చంద్రాతో కలిసి న్యూ వోతీ బాగ్‌లో గల పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. అదేవిధంగా నిర్మాణ్ భవన్‌లో కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, లోదీ ఎస్టేట్‌లో ఆ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ, ఔరంగజేబు లేన్‌లో ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఓటేశారు. ఇది ఎంతో ముఖ్యమైన రోజు అని బద్దకంగా ఉండకుండా అర్హులైన ప్రతీఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనాల్సిందిగా ఈ సందర్భంగా గాంధీల కుటుంబం పేర్కొంది. బీజేపీ సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీ ఆయన కూతురు ప్రతిభా అద్వానీ ఔరంగజేబు లేన్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు 15.68 శాతం పోలింగ్ నమోదైంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబసమేతంగా ఆయన ఓటింగ్‌లో పాల్గొన్నారు. తమ ఫ్యామిలీ ఫోటోను సీఎం కేజీ తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. తన కుమారుడు తొలి సారి ఓటింగ్ పక్రియలో పాల్గొన్నట్లు కేజీ చెప్పారు. యువ ఓటర్లు మొత్తం భారీ ఎత్తున పోలింగ్ బూత్‌లకు తరలిరావాలని కేజీ కోరారు. యువత ఓటింగ్‌లో పాల్గొంటేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని కేజీ అన్నారు. ఆమ్ ఆద్మీ మూడవ సారి అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఢిల్లీలో మొత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 1.47 కోట్ల ఓటర్లు ఉన్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటలకు ముగియనున్నది.

ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా కూడా ఓటేశారు. పత్‌పర్‌గంజ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిసోడియా భార్య సీమా సిసోడియా కూడా పాండవ్ నగర్‌లో ఉన్న ఎంసీడీ స్కూళ్లో ఓటేశారు. ఢిల్లీలో ఓ విషాదకర సంఘటన జరిగింది. బాబర్‌పూర్ ప్రైమరీ స్కూల్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ ఆఫీసర్ అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోయారు.

మేడారానికి జాతీయహోదాకు కృషి

వనదేవతలను దర్శించుకున్న కేంద్రమంత్రి అర్జును ముండా
జాతీయ హోదా కల్పించాలని మంత్రుల వినతి

మేడారం,ఫిబ్రవరి8(నేటినిజం ప్రతినిధి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా కల్పిస్తామని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా స్పష్టం చేశారు. శనివారం ఉదయం మేడారం జాతరకు వచ్చిన అర్జున్ ముండా.. గద్దెలపై ఉన్న వన దేవతలను దర్శించుకుని, నిలు వెత్తు బంగారం సమర్పించారు. అర్జున్ ముం డాకు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మం దలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ ఘనస్వాగతం పలికారు. మంత్రులు ఆయనకు దగ్గరుండి దర్శనం చేయించారు. దర్శన అనంతరం అర్జున్ ముండా మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న గిరిజనులు సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుంటారు అని ఆయన తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా సమ్మక్క – సారలమ్మ ప్రసిద్ధికెక్కారు అని పేర్కొన్నారు. త్వరలోనే మేడారం మహాజాతరకు జాతీయ గిరిజన పండగ కల సాకారం అవుతోందని ఆశిస్తున్నాను అని ఆయన అన్నారు. జాతీయ పండుగ హోదా అంశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తాను. త్వరలోనే గిరిజనుల కలను నిజం చేస్తానని అర్జున్ ముండా స్పష్టం చేశారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వినతిపత్రం అందజేశారు. జాతీయ పండుగగా గుర్తించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని అర్జున్ ముండాకు మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మేడారంలో జనమే జనం

వనదేవతల కోసం తరలి వస్తున్న ప్రజలు

మేడారం,ఫిబ్రవరి8(నేటినిజం ప్రతినిధి): ఆరాధ్య దేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లులకు మొక్కులు చెల్లించేందుకు వస్తున్న జనంతో మేడారం జనారణ్యంగా మారింది. ఎటు చూసినా వన దేవతల నామస్మరణ వినిపిస్తుంది. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం జాతరకు రావడంతో సందడిగా మారింది. చివరి రోజు కావడంతో ఎక్కడ చూసినా భక్తులే కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొదట గద్దెలను చేరుకుని వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్నారు. మ్మక్క నామస్మరణ తన్మయత్వాన్ని మదిలో నింపుకొని భక్తులు ఉరుకులు, పరుగులు తీస్తుండగా.. శివసత్తులు మాత్రం పూనకాలతో ఊగిపోతు రాళ్లు, రప్పలు, గుంతలు, బురద ఇవేమి లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా శుక్రవారం వరకు లక్ష 44,570మందికి వైద్య సేవలు అందించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అల్లం అప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ జాతరలో ఏర్పాటు చేసిన ప్రధాన వైద్యశాలతో పాటు 17 సబ్‌హెల్త్ క్యాంపుల ద్వారా భక్తులకు చికిత్స అందించినట్లు తెలిపారు. నిరంతరం 24గంటలు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. ఈనెల 3నుంచి సాధారణ వైద్య సేవల నుంచి అత్యవసరమైన వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. జాతర సందర్భంగా ప్రధాన వైద్యశాలలో రెండు సుఖప్రసవాలను నిర్వహించి, కేసీఆర్ కిట్‌ను అందించడంతో పాటు 1059మందికి ఇన్‌పేషంట్లుగా సేవలు అందించినట్లు తెలిపారు. జాతరలో ఇప్పటి వరకు వివిధ కారణాల ద్వారా జరిగిన ఏడు మరణాలను సైతం నమోదు చేసినట్లు వివరించారు. మేడారం మహా జాతరకు 12లక్షల మందికి పైగా భక్తులను తరలించేందుకు ఆర్టీసీ ద్వారా విశేష సేవలందించినట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.

హానీ ట్రాప్‌లో పడ్డ చేపల వ్యాపారి రమేశ్

పక్కా ప్లాన్ ప్రకారం హత్య

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): బోరబండ చేపల వ్యాపారి రమేష్ హత్య పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందని పోలీసులు తమ దర్యాప్తులో తేల్చారు. రమేష్ మర్డర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. అమ్మాయిలపై అతనికున్న పిచ్చే రమేష్ ప్రాణాలు కోల్పోవడానికి కారణమైందని పోలీసులు గుర్తించారు. చేపల వ్యాపారి రమేష్ కు ఉన్న బలహీనతను ఆసరాగా చేసుకునే నిందితుడు హత్యకు ప్లాన్ చేశాడని తెలిపారు. రమేష్ ఇంట్లో అద్దెకుండి ఖాళీ చేసిన రాజు నాయకే ఈ హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఈజీ మనీకి అలవాటుపడ్డ నిందితుడు రాజు నాయక్.... రమేష్ ను హానీ ట్రాప్ చేశాడు. తన దగ్గర అమ్మాయి రెడీగా ఉందని... రూముకు రావాలని ఫోన్ చేశాడు. రాజు నాయక్ మాటల నమ్మిన రమేష్... అతని రూముకు వెళ్లాడు. ఆ తర్వాత మద్యంలో మత్తు మందు కలిపి చంపేశాడు. అనంతరం రమేష్ ఒంటిపైనున్న బంగారాన్ని తీసుకుని తాకట్టు పెట్టాడు. అయితే, మళ్లీ రూముకి వచ్చిన నిందితుడు రాజునాయక్.... రమేష్ కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి 90లక్షలు ఇస్తే విడిచిపెడతానని, లేదంటే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. మరోవైపు, డెడ్ బాడీ డీకంపోజ్ అవుతుండటంతో ఎలాగైనాసరే బయటికి తరలించాలనుకున్నాడు. మృతదేహంలో కొన్ని భాగాలు నరికి ఎ÷–లాస్టింగ్ కవర్లో ప్యాక్ చేశాడు. అయితే, భారీ కాయం కావడంతో డెడ్ బాడీని బయటికి తరలించలేక రూమ్ లోనే వదిలేసి పరారయ్యాడు. చివరికి రూము నుంచి దుర్వాసన రావడంతో రమేష్ హత్య బయటపడింది. అయితే, సీసీటీవీ ఫుటేజ్, రూములో దొరికిన క్లూస్, మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడు రాజు నాయక్ ను అతనికి సహకరించిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు. అయితే, సమాజంలోనే ప్రతి సంఘటన నుంచి ప్రతి ఒక్కరూ గుణపాఠం నేర్చుకుని అప్రమత్తం కావాల్సిన అవసరం కచ్చితంగా కనిపిస్తుంది. ఇలా, అమ్మాయిలపై పిచ్చితో హానీ ట్రాప్ లో చిక్కుకుని ప్రముఖ వ్యాపారవేత్త జయరాం అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. మీడియాలో జయరాం హత్య పెద్దసంచలనమైంది. అమ్మాయిలపై పిచ్చే అతని ప్రాణాలు తీసిందని తెలిసింది. తెలిసినే వ్యక్తే హానీ ట్రాప్ తో ఇంటికి రప్పించుకుని కొట్టిచంపేశాడు. ఇలాంటి ఘటనలు రోజూ మన కళ్లే ముందే కనిపిస్తున్నా జాగ్రత్తపడకుండా మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ప్రాణాలు కోల్పోవడం శోచనీయమే.

ఒక్కరికి కూడా కరోనా నిర్ధారణ కాలేదు: మంత్రి ఈటల

హైదరాబాద్, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్కరికి కూడా కరోనా వైరస్ నిర్ధారణ కాలేదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కరోనా అనుమానిత కేసులపై మంత్రి స్పందిస్తూ... కరోనా వైరస్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఈ వైరస్ ప్రపంచంలో 26 దేశాలకు వ్యాపించిందన్నారు. అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నగరంలోని గాంధీ, ఫీవర్, ఛాతీ ఆస్పత్రుల్లో ఐసోలేటెడ్ వార్డులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గాంధీ ఆస్పత్రిలోనే కరోనా వైరస్ రక్తనమూనాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 నుంచి 7 గంటల వ్యవధిలో పరీక్షల నివదికలు ఇస్తున్నామన్నారు. చైనా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 125 మందిని పర్యవేక్షణలో ఉంచినట్లు మంత్రి చెప్పారు. 60 నుంచి 70 మంది నమూనాల పరీక్షల నివేదికలు వచ్చినట్లు వీరెవరికి కరోనా వైరస్ నిర్ధారణ కాలేదన్నారు. ఆరోగ్యశాఖ తరపున ఎప్పటికప్పుడు ప్రకటన విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కరోనా వైరస్ సాధారణ జలుబు లక్షణాలు కలిగి ఉంటుందని.. అటువంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగిన దృష్ట్యా కరోనా వ్యాపించే ఆస్కారం లేదని పేర్కొన్నారు.

చరిత్రలో నేటినిజం

నిజమైనప్రతిభ తోడుత
ప్రజలకు సంతోషమొసగు ప్రతిభామయుడై
విజయము సాధించు" మహామ
ధిజవారు ఉద్ధేశించి "గానుత సభినందనలనే!!

ఫిబ్రవరి 8 మహమ్మద జహరుద్దీన్ జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

కాంగ్రెస్, ఆప్ కార్యకర్తలకు మధ్య స్వల్ప వివాదం

-ఆప్ కార్యకర్తపై చేయిచేసుకోబోయిన ఆల్కా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): నార్త్ ఢిల్లీలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, ఆప్ కార్యకర్తలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్కా లంబా.. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తను కొట్టబోయారు. అంతలోనే అతను తప్పించుకున్నాడు.

అప్రమత్తమైన పోలీసులు.. ఆప్ కార్యకర్తను అదుపులోకి తీసుకున్నారు. అసభ్యకరమైన పదజాలంతో దూషించిన ఆప్ కార్యకర్తను పట్టుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు. కానీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అభ్యర్థి ఆల్కా లంబా స్పందించారు. పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి.. పోలింగ్ సెంటర్‌కు వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించే హక్కు ఉంది. తాను పోలింగ్ కేంద్రానికి వెళ్తే.. ఆప్ కార్యకర్త అసభ్యరమైన పదజాలంతో దూషించారు. తాను కొట్టబోయే సరికి పోలీసులు అతన్ని చుట్టుముట్టారు. ఓడిపోతామనే భయంలో ఆప్ కార్యకర్తలు ఉన్నారని ఆల్కా లంబా పేర్కొన్నారు. చాందినీ చౌక్ నియోజకవర్గంలో తప్పకుండా కాంగ్రెస్ గెలుస్తుందని ఆల్కా లంబా ధీమా వ్యక్తం చేశారు. ఇక తనను దూషించిన ఆప్ కార్యకర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు ఆల్కా లంబా.

ఎన్ఆర్ఐ మహిళపై అత్యాచారం

వీడియోలతో వేధింపులు..భారీగా సొమ్ము కాజేత
ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మహిళతో స్నేహం ముసుగులో మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడితోపాటు సహకరించిన భార్య, మేనల్లుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన మామిడి సంజీవరెడ్డి(48) నిజాంపేట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. 2018 జూలైలో ఫేస్‌బుక్ ద్వారా ఎన్నారై మహిళతో అతడికి పరిచయం ఏర్పడింది. అక్టోబర్ 31న ఆమె అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో రిసీవ్ చేసుకొని ఆమె చెల్లెలు ఇంటి వద్ద విడిచిపెట్టాడు. రెండు రోజుల అనంతరం ఆమెను భోజనానికి ఆహ్వానించి కూకట్‌పల్లిలోని సితార హోటల్‌కు తీసుకెళ్లాడు. తన భార్య కావేరి (48), మేనల్లుడు విశాల్‌రెడ్డి(22)ని ఆమెకు పరిచయం చేశాడు. తమతో కలిసి భోజనం చేయాలని ఆ మహిళకు చెప్పగా.. వద్దని చెప్పింది. మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇవ్వడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ముగ్గురూ కలిసి ఎన్నారై మహిళను నిజాంపేటలోని వారికి ఇంటికి తీసుకెళ్లారు. మత్తులో ఉన్న ఆమెపై సంజీవరెడ్డి అత్యాచారం చేసి వీడియోలు తీశాడు. అప్పటి నుంచి బ్లాక్‌మెయిల్ చేస్తూ ఆమె నుంచి 30 తులాల బంగారం, ఆరువేల యూఎస్ డాలర్లు, చెక్కు బుక్‌లు, ఏటీఎం కార్డులు, సుమారు రూ. 50 లక్షలు తీసుకున్నాడు. రోజు రోజుకూ అతడి వేధింపులు అధికమవడంతో బాధితురాలు ఈనెల 4వ తేదీన బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంజీవరెడ్డిని అతడికి సహకరించిన భార్య కావేరి, మేనల్లుడు విశాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేటినిజం
ఆదివారం 9-2-2020

'వాణిజ్య సమీకృతి'

మొదట కేవలం 'వాణిజ్య సమాఖ్య'గా అవతరించిన పశ్చిమ ఐరోపా దేశాలు 'రాజకీయ దౌత్య సమైక్య వ్యవస్థ'గా పరిణతి చెందడం దాదాపు డెబ్బయి ఏళ్ల చరిత్ర. 1950 దశకంలో ఈ 'సమీకృతి' ప్రస్ఫుటించిన నాటికి తూర్పు ఐరోపా దేశాలలో 'ఏకపక్ష కమ్యూనిస్టు నియంతృత్వ వ్యవస్థలు' ఏర్పడి ఉన్నాయి. అందువల్ల 'బహుళపక్ష ప్రజాస్వామ్య' వ్యవస్థలున్న పశ్చిమ ఐరోపా దేశాలకు మాత్రమే 'ఐరోపా ఆర్థిక కూటమి'– యూరోపియన్ ఎకనామిక్ కోఆపరేషన్– ఇఇసి– పరిమితమై ఉండేది. 'ఇఇసి' ఆర్థిక వాణిజ్యాలకు పరిమితంకాక 'రాజకీయ దౌత్యకూటమి'గా 'ఐరోపా సమాఖ్య'గా ఏర్పడింది. 'ఐరోపా సమాఖ్య'కు పార్లమెంటు, ఐరోపా పతాకం, ఐరోపా గీతం, సచివాలయం, రాజధాని, సమీకృత 'ద్రవ్య రూపం'– యూనిఫార్మ్ కరెన్సీ– యూరో– ఏర్పడడం తరువాతి చరిత్ర... ఐరోపా దేశాల మధ్య రాజకీయ సార్వభౌమపు సరిహద్దులు చెఱగిపోయాయన్నది జరిగిన ప్రచారం. 1989వ, 1991వ సంవత్సరాల మధ్య తూర్పు ఐరోపా దేశాలలోను, సోవియట్ రష్యాలోను 'ఏకపక్ష కమ్యూనిస్టు నియంతృత్వ' వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. ఆయా దేశాలలో 'బహుళపక్ష ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థ'లు వికసించాయి. ఫలితంగా తూర్పు ఐరోపా దేశాలు కూడ 'ఐరోపా సమాఖ్య'లో సభ్య దేశాలయ్యాయి! ఐరోపా దేశాల మధ్య భౌతికమైన సరిహద్దులు అంతరించిపోయాయి. ఒక దేశంనుంచి మరో దేశానికి 'ప్రయాణ అనుమతి పత్రాలు'– 'వీసా'లు– అవసరంలేని రాకపోకలు మొదలయ్యాయి!! ఇరవై తొమ్మిది ఐరోపా దేశాలు 'సమాఖ్య'లో భాగస్వాములయ్యాయి. బ్రిటన్ నిష్క్రమణతో ఈ సంఖ్య ఇరవై ఎనిమిదికి దిగజారింది.

ఇలా 'ఐరోపా సమాఖ్య'లో భాగస్వామ్యం ఏర్పడిన తమ దేశపు 'సరిహద్దుల' ప్రాధాన్యం చెఱగిపోయిందని బ్రిటన్ ప్రధానమంత్రి ఇప్పుడు వాపోతున్నాడు. 'ఐరోపా సమాఖ్య'లో భాగస్వామ్యంవల్ల తమ రాజకీయ సార్వభౌమ అధికారం కూడ నశించిపోయినట్టు 'బోరిస్ జాన్సన్' ఇప్పుడు కనిపెట్టాడు, 'సమాఖ్య'నుంచి నిష్క్రమించిన తరువాత కనిపెట్టాడు. 'నిష్క్రమణ'తరువాత తమ దేశపు సరిహద్దులను భద్రపరచుకొంటామని, అక్రమ ప్రవేశకులు– ఇల్లీగల్ ఇమ్మిగ్రెంట్స్–ను నిరోధిస్తామని బోరిస్ జాన్సన్ కఠోరప్రతిజ్ఞలు చేస్తున్నాడు! శతాబ్దులపాటు వివిధ దేశాల ఆర్థిక, వాణిజ్య, రాజకీయ, సాంస్కృతిక, జాతీయ సార్వభౌమ అధికారాలను భగ్నంచేసి అంతర్జాతీయ దురాక్రమణ శక్తులలో అగ్రస్థానం వహించిన 'బ్రిటన్'ఇలా తన సార్వభౌమ అధికారం దశాబ్దుల తరబడి భగ్నమైపోయిందని ఇలా బహిరంగ 'రోదన'కు పాల్పడడం అభద్రతా భావానికి నిదర్శనం. ఇరవయ్యవ శతాబ్ది ఆరంభం నాటివరకు 'అంతర్జాతీయ' సామ్రాజ్యానికి ఆధిపత్యం వహించిన బ్రిటన్‌కు ఇలా తమ జాతీయ భౌగోళిక సమైక్యం పట్ల 'అభద్రతాభావం' ఏర్పడడం సహజ పరిణామక్రమం. ఇతర జాతులను దోచుకున్న జాతులు ఎప్పుడో అప్పుడు పతనం కావడం సంభవం... "విధాత అక్కటా! ఎవ్వరినెట్లు చేయదు?"అన్న మహాకవి వాక్యం బ్రిటన్ పట్ల ఇలా నిజమైంది. ఈ అభద్రతాభావం బ్రిటన్‌కు ఇరవై ఏళ్లుగా ఏర్పడి ఉంది. అందువల్లనే బ్రిటన్ ఐరోపా 'సమష్టి ద్రవ్య వినిమయ' యూనిఫైడ్ మానిటరీ వ్యవస్థలో చేరలేదు. వివిధ ఐరోపా దేశాలు తమ తరతరాల 'వినిమయ మాధ్యమాల'కరెన్సీ ను విడనాడి 'యూరో'ను ద్రవ్య వినిమయ మాధ్యమంగా స్వీకరించాయి. బ్రిటన్ ఇలా స్వీకరించలేదు, తమ 'పౌండ్ స్టెర్లింగ్'ను వదలుకోలేదు. 'స్కాట్‌లాండ్' బ్రిటన్‌నుంచి దాదాపు విడిపోయే ప్రమాదం ఏర్పడడం 'బ్రిగ్జిట్'కు సమాంతర విపరిణామం! బ్రిటన్‌లో జాతీయ అస్తిత్వ పరిరక్షణ పట్ల ధ్యాస పెరగడానికి ఇది కూడ ఒక ప్రధాన కారణం! ఫలితంగా తమ జాతీయ అస్తిత్వాన్ని ఐరోపా అస్తిత్వం దిగమింగివేస్తున్న భయం ప్రబలింది. 2016 జూన్ 23వ తేదీన 'ఐరోపా సమాఖ్య'నుంచి వైదొలగాలని బ్రిటన్ మత ప్రదాతలు– వోటర్‌లు–నిర్ధారించారు. వెంటనే ప్రారంభమైన 'నిష్క్రమణ ప్రక్రియ' పూర్తికావడానికి మూడున్నర సంవత్సరాలు పట్టింది, గత జనవరి 31న 'నిష్క్రమణ' ప్రక్రియ పూర్తయింది!! వాణిజ్య ప్రపంచీకరణ– గ్లోబలైజేషన్– పేరుతో 'కృత్రిమ అంతర్జాతీయ ఏకత్వాన్ని'సాధించాలన్న యత్నానికి ఇలా 'ఐరోపా సమాఖ్య'నుంచి బ్రిటన్ నిష్క్రమించడం ఎదురుదెబ్బ! ఐరోపా 'వాణిజ్య సమీకృతి'కి విస్తృతి 'ప్రపంచీకరణ'!

ఆదిలాబాద్‌లో స్వచ్ఛ కార్యక్రమాలు

చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీ

మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ పట్టణ పరిధిలో సేకరించిన వ్యర్థపదార్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రకటించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీకీ డంపింగ్‌యార్డు కోసం 36 ఎకరాల స్థలం ఉంది. ఎక్కువ స్థలం ఉండటంతో వివిధ రకాల వ్యర్థాల నిర్వహణ కోసం పలు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇప్పటికే వానపాముల పెంపకం జరుగుతుండగా, ప్లాస్టిక్ వ్యర్థాలు, మలినాల నుంచి ఎరువుల తయారీ పరిశ్రమలు త్వరలో ప్రారంభమ వుతాయిని, దీంతో బల్దియాకు ఆదాయం సైతం సమకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు ప్రైవేటు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కర్మాగారం ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రెస్టిన్ భారత్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించింది. రూ. కోటి వరకు ఖర్చవుతుండగా ఇప్పటికే పనులు ప్రారంభ మయ్యాయి. ఎకరం స్థలంలో ఏర్పాటు చేసి ఈ ఫ్యాక్టరీ కంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తయింది. మలినాలను ట్యాంకుల ద్వారా కర్మాగారానికి తరలించి సంపులో వేయగానే మలిన పదార్థాలు శుద్ధీగా మారి ఎరువులుగా తయారవుతాయి. వీటిని పంట పొలాలతో పాటు మొక్కల పెంపకానికి ఉపయోగిస్తారని అధికారులు తెలిపారు. పట్టణంలో సెప్టిక్ ట్యాంకుల ద్వారా సేకరించి మలినాలు ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా ఈ కర్మాగారానికి తీసుకువస్తారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజల ఇబ్బందులు దూరం కావడంతో పాటు వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉన్నాయి. వీటిల్లో 10 శివారు ప్రాంతాల వార్డులు కాగా మిగితావి పట్టణంలో ఉంటాయి. బల్దియా పరిధిలో వ్యాపార, వాణిజ్య సముదాయలతో పాటు 28,020 నివాస గృహాలు ఉండగా సిబ్బంది రిక్షాలు, ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తారు. ఎ÷–లాస్టిక్ వ్యర్థాలుసైతం మున్సిపల్ సిబ్బంది తీసుకుపోతారు. వీటితో పాటు సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించిన మలిన పదార్థాలను సేకరించి పరిసర ప్రాంతాల్లో పడవేయడంతో అక్కడ దుర్గంధం వ్యాపిస్తుంది. దీంతో పరిసరా ప్రాంతాల్లో నివాసం ఉండేవారు ఇబ్బందులుపడుతుండ´డంతో పాటు వాతావరణం కాలుష్యంగా మారుతుంది. ఈ సమస్యల పరిష్కారం కోసం మున్సిపాలిటీల్లో వ్యర్థ పదార్థాల నిర్వహణ కోసం పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు ఎకరం స్థలంలో వ్యర్థాల నిర్వహణ పరిశ్రమలను నిర్మించి చుట్టూ మొక్కల పెంపకాన్ని చేపడుతారు. బంగారుగూడ డం పింగ్‌యార్డులో ఇప్పటికే సేంద్రియ ఎరువుల తయారీలో భాగంగా వానపాముల పెంపకం చేపట్టారు. త్వరలో పాస్టిక్ వ్యర్థాల నిర్వహణ పరిశ్రమ సైతం ఏర్పాటు కానుంది. వీటికోసం బల్దియా డంపింగ్ యార్డులో స్థలాన్ని అద్దెరూపంలో కేటాయించింది.

మూడు ప్రాంతాల్లో కందుల కొనుగోళ్లు

–వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు

నిర్మల్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): కందులను కొనుగోలుకు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే మూడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్వింటాలుకు రూ. 5,800 మద్దతు ధర చెల్లిస్తున్నామని , రైతులు కందులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని అధికారులు కోరారు. కుభీర్, భైంసా, నిర్మల్‌లో ఇప్పటివరకు 3500 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేశారని వివరించారు. త్వరలో ముథోల్, తానూరులో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. రైతును రాజుగా చేయడమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రైతు సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. కేంద్రానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం కన్నా ఎక్కువ ఇవ్వాలన్నారు. ఏడాదికి కేవలం రూ.6వేలు మాత్రమే ఆర్థిక సాయం ప్రకటించడం.. అది కూడా మూడు విడతల్లో ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నారన్నారు. గతంలో రూ.లక్ష పంట రుణాలను మాఫీ చేశారని గుర్తుచేశారు. పంట పెట్టుబడి కోసం ఎకరాకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచుతామని, రైతుబంధు పథకాన్ని అన్ని రాష్ట్రాలు స్వాగతిస్తున్నాయన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను కూడా ప్రోత్సహించి ఉపాధి పెంపొందించేందుకు కృషిచేస్తున్నామన్నారు.

త్వరగా మిషన్ భగీరథ పూర్తి

–చురుకుగా పూర్తి కావస్తున్న పనులు

జగిత్యాల,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): ప్రతి ఇంటికీ నీరివ్వాల న్నదే ప్రభుత్వ లక్ష్యమనీ, ఆ దిశగా అధికారులు, కాంట్రాక్టర్లు పనిచేయాలని అధికారులు ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు గ్రామాల్లో ప్రతి ఇంటింటికి వచ్చేలా ఇవ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా పనిచేసి నల్లాలు పెట్టి కనెక్షన్ ఇవ్వాలన్నారు. అలాగే చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనిచేయని కాంట్రాక్టర్లను తొలగించి వారి స్థానంలో మరొకరిని తీసుకొని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా గ్రామాల్లో నీరు అందించాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లకు సూచించారు. పైపులు వేసినప్పుడు తవ్విన గుంతలు పూడ్చాలనీ, సీసీ రోడ్డులు తవ్విన దగ్గర సీసీ రోడ్డును సరిచేయాలన్నారు. పైపులు అసంపూర్తిగా చేయకూడదనీ, పాత, కొత్త ట్యాంకులు పూర్తి చేసి అన్ని ట్యాంకులకు నీటి కనెక్షన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా బుగ్గారం, ధర్మపురి, గొల్లపెల్లి, పెగడపల్లి, వెల్గటూర్, బీర్‌పూర్, జగిత్యాల, రాయికల్, సారంగాపూర్, కొ డిమ్యాల, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి మండలాల వారీగా కాంట్రాక్టర్లు, ఇంజినీర్లతో మాట్లాడుతూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

విసిల నియామకం ఎప్పుడు?

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): తెలంగాణలో వివిధ విశ్వవిద్యాలాల్లో ఖాళీగా ఉన్న విసి పోస్టులను భరత్ఈ చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. విసిల ఖాళీలతో పాటు ఉపాధ్యాయ పోస్టులను నియమించాలని కోరుతున్నాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పోరాటాలను అణిచివేసే కుట్ర జరుగుతున్నదని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. వర్సిటీ వీసీలను నియమించలేని అసమర్థ ప్రభుత్వ పాలనలో ఉన్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన ప్రవేశపెట్టాలన్నారు. రాష్ట్రంలో ఏటా వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కార్పొరేట్ విద్యా వ్యాపారంలో రాష్ట్ర మంత్రులకు వాటాలున్నాయని ఆరోపించారు. రకరకాల బ్యాచ్‌ల పేరుతో శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఒకటే బ్రాంచ్ పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో కాలేజీల ను నడిపిస్తున్నారన్నారు. ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చే వరకూ పోరాడుతామని చెప్పారు. రాష్ట్ర బ్జడెట్ ప్రవేశపెట్టిన రోజున తమ పార్టీ కార్యాయలంలో ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని నిర్వహించ బోతున్నామని పేర్కొన్నారు. ఫేర్ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా మెట్రో రైలు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

శిక్షల అమల్లో మీనమేషాలు ఎందుకు?

హైదరాబాద్, ఫిబ్రవరి 8:వివిధ కేసుల్లో తీర్పులు సకాలంలో వస్తున్నా అమలు చేయడంలో మాత్రం ప్రభుత్వ యంత్రాంగం విఫలం అవుతోంది. తక్షణ న్యాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్న వేళ అది ఓ ఎండమావిగా కనిపిస్తోంది. నిర్భయ కేసే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. గతంలో అఫ్జల్‌గురు, కసబ్‌ల వ్యవహారంలోనూ ఇలాగే జరిగింది. నేరం చేసిన వాడికి బతికే హక్కు లేకుండా చేసినప్పుడే సమాజాంలో భయం కలుగు తుంది. గల్ఫ్ దేశాలతో పాటు,చైనా మలేషియాల్లో లాగా కాలపరిమితిలో విచారణ, శిక్షలు పూర్తయ్యేలా మన చట్టాలను మార్చుకుంటే తప్ప ప్రజల్లో విశ్వాసాన్ని పాదుకొల్పలేం. నిర్భయ కేసులో ఉరితీతకు సంబంధించి కొనసాగుతున్న ప్రహసనం ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. దీనిపై సుప్రీంలో వాదనల సందర్భంగా ప్రభుత్వం కూడా అసహనం వ్యక్తం చేసింది.

ఇకపోతే హాజీపూర్ వరుస హత్యాచార కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు నిందితుడు శ్రీనివాసరెడ్డికి ఉరిశిక్ష విధించింది. ఈ సందర్భంగా గ్రామస్థులంతా ముక్త కంఠంతో తీర్పును స్వాగతించారు. అంతేగాకుండా పైకోర్టుకు వెళ్లే అవకావం లేకుండా తక్షణం ఉరిశిక్షను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉన్న ఆక్రోశానికి ఇది నిదర్శనంగా చూడాలి. తీవ్ర ఉత్కంఠ నడుమ విచారణ ముగియడంతో నిందితుడు సైకో కిల్లర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్ష ఖరారైంది. ఇటీవలే సమత హత్యకేసులో నిందితులకు ఉరిశిక్ష పడటం, నిర్భయ కేసులోని దోషులకు ఉరిశిక్ష ఖరారు కావడంతో ఆది నుంచే సర్వత్రా ఆసక్తి నెలకొంది. నల్లగొండ ఫోక్సో కోర్టు గురువారం తుది తీర్పును వెల్లడించింది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన సైకోకిల్లర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి లిఫ్ట్‌పేరుతో ముగ్గురు మైనర్ బాలికలను బైక్‌పై ఎక్కించుకుని తన వ్యవసాయ బావివద్దకు తీసుకెళ్లి అత్యాచారం చేసి, హత్య చేసి బావిలో పూడ్చి పెట్టాడు. ఇలా ఇప్పటివరకు శ్రావణి, మనీష, కల్పనలను చంపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గతేడాది ఏప్రిల్ 25వ తేదీన హాజీపూర్ గ్రామానికి చెందిన శ్రావణి కనిపించడం లేదంటూ వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు స్పందించారు. 26వ తేదీన కిల్లర్ శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఆ బాలికకు చెందిన స్కూల్ బ్యాగును గ్రామస్తులు గుర్తించారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి దారుణాలు వెలుగులోకి వచ్చాయి. ఆ తరువాత పోలీసులు నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గతంలో కూడా మిస్సయిన అదే గ్రామానికి చెందిన మనీషతోపాటు మైసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన తుంగని కల్పనను కూడా ఇదే తరహాలో అత్యాచారం చేసి చంపినట్లు పోలీసులు గుర్తించారు. అతనిచ్చిన సమాచారంతోనే బావిలో తవ్వకాలు జరిపి ఆ ఇద్దరు బాలికల అస్తికలు కూడా స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ఈ హత్యోదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ముగ్గురు మైనర్ బాలికలపై అత్యంత క్రూరంగా అత్యాచారానికి ఒడిగట్టి, వారిని చంపి పాడుబడ్డ బావిలో పూడ్చిపెట్టిన సైకో కిల్లర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డిని ఉరితీయాలని, ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తూ గతంలో ఆ గ్రామస్తులు ఆందోళనలు కూడా చేపట్టారు. వివిధ పార్టీలు, మహిళా, ప్రజాసంఘాలు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించాయి. మృతులు ముగ్గురు మైనర్ బాలికలే కావడంతో కేసును తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. సాక్షులను, కేసును విచారించేందుకు నల్లగొండలో ప్రత్యేకంగా పోక్సో కోర్టును ఏర్పాటు చేసింది. నమోదైన సాక్ష్యాలపై సెక్షన్ 113 కింద నిందితుడి అభిప్రాయాన్ని కూడా కోర్టు తీసుకుంది. దీని తర్వాత ఇరుపక్షాల వాదనలు కూడా పూర్తవడంతోపాటు కోర్టులో నేరం నిరూపణ అయింది. దీంతో నల్లగొండ పోక్సో కోర్టు నేరస్తుడు శ్రీనివాస్‌రెడ్డికి ఉరిశిక్షను విధించింది. సంచలనం కలిగించిన ఈ కేసుపై అందరి దృష్టి నెలకొంది.

నిర్భయ కేసులో నిందితులకు ఉరి, ఇటీవలే అదిలాబాద్ జిల్లాలో హత్యాచారానికి గురైన సమత హత్య కేసులో నిందితులకు ఉరిశిక్ష పడటంతో, ఈ కేసులోనూ ఉరిశిక్ష పడాలని ప్రజలు కోరుకున్నారు. అంతేగాకుండా శిక్షను తోణమే అమలు చేయాలన్న ఆందోళన ప్రజలనుంచి వచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే నేరస్తులకు పై కోర్టుకు వెళ్లకుండా వెంటనే శిక్ష అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి. కుమురం భీం అసిఫాబాద్ జిల్లాలో చిరు వ్యాపారం చేసుకుంటున్న మహిళను అపహరించి, సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులు షేక్ బాబు, షాబుద్దీన్, షేక్ మఖ్దూంలకు ఉరిశిక్ష ఖరారు చేస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు వెలువరించింది. ఉరిశిక్ష విధింపు విషయంలో భిన్నాభిప్రాయం ఉన్నవారు సైతం తెలంగాణ పోలీ సులు పకడ్బందీగా దర్యాప్తు చేయడాన్ని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు కూడా ఈ కేసు విచారణను సత్వరం పూర్తి చేయడాన్ని హర్షిస్తారు. అత్యాచారాలు తరచుగా చోటుచేసుకోవడానికి గల ముఖ్య కారణాల్లో వ్యవస్థలు సక్రమంగా స్పందించకపోవడం ఒకటని 2012లో నిర్భయ ఉదంతం తర్వాత కేంద్రం నెలకొల్పిన జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ చెప్పడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. సమాజంలో ఆగ్రహావేశాలు పెల్లుబికి, మీడియాలో బాగా ప్రచారంలోకొచ్చిన కేసుల విషయంలో మాత్రమే పోలీసులు శ్రద్ధ పెడుతున్నారని, న్యాయస్థానాలు కూడా వేగంగా విచారణ చేస్తున్నాయన్న విమర్శలున్నాయి. అత్యాచారం కేసుల్లో మాత్రమే కాదు... ఆడపిల్లల పట్ల జరిగే ఏ చిన్న లైంగిక నేరంలోనైనా ఇదేవిధమైన శ్రద్ధ పెట్టడం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా అవసరం. శిక్షలను తోణం అమలు చేస్తే ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం కుదురుతుంది. అందువల్ల తోణ శిక్షల అమలుకు ప్రయత్నాలు చేయాలి.

రెవెన్యూ ప్రక్షాళనకు రంగం సిద్ధం

వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కొత్త చట్టం

ఇప్పటికే ఉన్నతాధికారులతో సిఎం చర్చ

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): పాలనలో కీలకమైన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి ప్రజలకు మరింత చేరువయ్యేలా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే సిఎం కెసిఆర్ స్పష్టతను ఇచ్చారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోచట్టానికి పదను పెట్టనున్నారు. రెవెన్యూలో పాలనను ప్రక్షాళన చేయడంతో పాటు పారదర్శకతను జోడించాలన్న లక్ష్యంతో సిఎం కెసిఆర్ ఎప్పటి నుంచో చట్టసవరణను ప్రతిపాదిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాలని ఆలోచన చేయగానే,ఆశాఖ ఉద్యోగుల్లోతీవ్ర కలవరాన్ని సృష్టించింది. కొత్త రెవెన్యూ చట్టంతో సేవలు మెరుగుపడతాయని, రెవెన్యూ ఉద్యోగులు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. అయితే అవినీతి విషయంలో మాత్రం క్షమించేది లేదని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. ఉద్యోగులు ప్రజల పక్షాన ఉండి వారికి న్యాయం చేయకపోవడం వల్లనే సమస్యలు వస్తున్నాయి. అయితే కొత్త రెవెన్యూ చట్టం ద్వారా తమ గుర్తింపును కోల్పోతామనే భావనతో రెవెన్యూ ఉద్యోగులు అపోహ పడుతున్నారు. ప్రభుత్వం అంటేనే వివిధ శాఖల సమాహారం. అంతులో రెవెన్యూ శాఖ కూడా ఒకటి. కానీ ఇటీవలి కాలంలో కొందరు ఉద్యోగుల తీరు కారణంగా రెవెన్యూ శాఖపై ప్రజల్లో ఆగ్రహం నెలకొంది. దశాబ్దాలుగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నరైతులకు ఇబ్బంది తొలగించడానికి సీఎం సాహసోపేతంగా భూరికార్డుల ప్రక్షాళన కోసం నిర్ణయం తీసుకున్నారు. రెవెన్యూ శాఖలో ఉన్న అవినీతిని రూపుమాపేందుకు చట్టాన్ని బలోపేతం చేయానల్న నిర్ణం జరిగింది. అయితే కొద్దిమంది తీరుతో శాఖ కొంత బద్నాం అయ్యింది. దీని గురించి చర్చించుకొని సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ వ్యవస్థలో ఎక్కడో పొరపాటు జరగడంతో లోపం ఏర్పడిందని, దానిని సరిచేయడానికి కొత్త చట్టం గురించి ఆలోచిస్తున్నారని, ప్రజలు, రైతులకు మెరుగైన సేవలు అందించడానికే దీనికి రూపకల్పన చేస్తున్నారని ఇప్పటికే ప్రకటించారు. ఉద్యోగులు రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన 100శాతం పనిచేశారని, పలు కార్యక్రమాలతో రికార్డు కొంత దెబ్బతిన్నదని, సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో కొంత నష్టం జరిగిందని, రైతులకు బాధ కలిగిందన్న భావనా ఉంది. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన ద్వారానే అమలు జరుగుతోంది.కొంత మందితో రెవెన్యూ శాఖకు చెడ్డపేరు ఆపాదించుకోవాల్సి వచ్చిందని, కొందరు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని సిఎం కెసిఆర్ పదేపదే చెబుతున్నా పరిస్తితిలో మార్పు రాలేదు. కష్టపడే వాళ్లు చాలా మంది ఉన్నారని, కొందరితోనే చెడ్డపేరు వస్తుందన్నారు. బాధ్యతల కారణంగా ఒత్తిడి ఉండవచ్చని, దానిని అధిగమించా లన్నారు. తమ వద్దకు వచ్చే ప్రజలకు సకాలంలో పనులు పూర్తిచేసి వారి మన్ననలు పొందాలన్నారు. రెవెన్యూ శాఖ అంటేనే ప్రభుత్వమని, మనం బాగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు.

కొత్త రెవెన్యూ చట్టం కేవలం వ్యవస్థలో లోపాలు సరిచేసి ప్రజలకు మరింత మేలు చేసేందుకే అని కూడా ప్రకటించారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఆయన ఆలోచనలన్నీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే. అలాంటి పరిస్థితుల్లో భూరికార్డుల ప్రక్షాళన ద్వారా ఎంతో శ్రమకోర్చి పనిచేసిన రెవెన్యూ ఉద్యోగులు అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర ఆక్రోశం నెలకొంది. దీంతో ప్రక్షాళనకు సిఎం కెసిఆర్ పూనుకున్నారు.

నిజామాబాద్‌లో టిఆర్ఎస్ వర్సెస్ బిజెపి

తండ్రీ కొడుకులు లక్ష్యంగా టిఆర్ఎస్ విమర్శలు

పసుపుబోర్డు హామీలను ప్రస్తావిస్తూ ఎదురుదాడి

నిజామాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): పసుపు బోర్డు ఏర్పాటు వ్యవహారం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో రచ్చకు కారణమయ్యింది. బిజెపి వర్సెస్ టిఆర్ఎస్ అన్నట్లుగా విమర్శలు,ప్రతివిమర్శలు సాగుతున్నాయి. ప్రధానంగా ఎంపి అర్వింద్ కేంద్రంగా టిఆర్ఎస్ నేతలు విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నారు. పనిలోపనిగా ఆయన తండ్రి, రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్‌ను కూడా టార్గెట్ చేస్తున్నారు. తండ్రీకొడకులు ఇద్దరూ.... అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల్లో పసుపు బోర్డుపై హామీ ఇచ్చిన బీజేపీ మోసం చేసిందని జిల్లా నేతలు వరుసగా విమర్శలు చేస్తున్నారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చి, బాండ్‌పేపర్ రాసి ఇచ్చిన అర్వింద్.. బోర్డు తేలేదు కదా ఏకంగా బోర్

సేద్యంలో మార్పులకు వ్యవసాయశాఖ సిద్ధం

పంటకాలనీల ఏర్పాటుతో రైతులకు లాభం

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై అధ్యయనం

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): పంట కాలనీలను ఏర్పాటు చేసి సేద్యంలో విప్లవాత్మక మార్పులు తెస్తామని సీఎం పకటించినట్లుగానే రంగంలోకి దిగారు. పంట కాలనీలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలనే ముఖ్యమంత్రి ఆదేశాలతో కదిలిన ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పార్థసారథి పలు సూచనలతో ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ రంగ స్వరూపాన్ని మార్చేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మూస పద్ధతిలో నడుస్తున్న ప్రస్తుత సేద్యపు విధానాల నుంచి రైతులను ఆధునికం వైపు నడిపించే బృహత్తర పథకానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండిస్తే మార్కెట్‌లో అడ్డగోలు దోపిడీకి గురవుతూ తీవ్ర నిరాశలో కూరుకుపోయి చివరకు కాడిని వదిలేసిన వాళ్లు ఎందరో ఉన్నారు. అందుకే ప్రభుత్వం రైతులు నష్టపోకుండా ఉండేదుకు క్రావ్ కాలనీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేశారు. అక్కడ సత్ఫలితాలు రావడంతో రాష్ట్రమంతా అమలుకు నిర్ణయించారు. ఒక ప్రాంతంలో రైతులు ఎక్కువగా పండించే పంటలను సర్వే చేసిన తర్వాత వాటికి అనుబంధంగా ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే పక్రియ ఉంటుంది. రైతులు పండించిన పంటను అడ్డగోలుగా కాకుండా ప్రాసెసింగ్ చేసి అత్యంత నాణ్యతతో డిమాండ్ చోటుకు తరలించి అమ్ముతారు. దీంతో రైతులు అధిక లాభాలు పొందే వీలుంటుంది. ఇందుకోసం ఎంపిక చేసిన గ్రామాల్లో శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. పంట కాలనీల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలోని రైతుల వివరాల కోసం సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. దీనికి 39 అంశాలతో కూడిన సర్వే ప్రొఫార్మాను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హైదరాబాద్‌లోనే ఉన్నతస్థాయి అధికారులతో రూపొందించారు. ప్రస్తుతం ఈ ప్రొఫార్మా ఫారాలను జిల్లా అవసరాలకు కావాల్సినన్ని స్థానికంగానే ముద్రించే పక్రియ నడుస్తున్నది. ఇది పూర్తి కాగానే జిల్లాలోని అన్ని మండలాల్లో రైతుల సమగ్ర సర్వే ప్రారంభమవుతుంది. ఈ సర్వే పక్రియను జిల్లాలోని ఎంఏవోలు, ఏడీఏలు, జేడీఏ పర్య వేక్షిస్తారు. రెండు నెలల్లో ఈ సర్వే పూర్తి కావాలనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో సమగ్ర సర్వే రిపోర్టు ఆధారంగ ఏ ప్రాంతంలో ఏ పరిశ్రమలు నెలకొల్పాలనే నిర్ణయం తీసుకుంటారు. పంట కాలనీల కోసం చేపట్టనున్న సర్వే సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు అన్ని వివరాలూ తీసుకుంటారు. సర్వేలో రైతు పట్టాదారు పాసు పుస్తకం నంబరు, బ్యాంకు ఖాతా నంబరు, సామాజక స్థితి, రైతులకు భూమి విస్తీర్ణం, నీటి పారుదల వసతి కూడా సేకరిస్తారు. రైతు భూమి స్వభావంతో పాటు, రైతులు వానాకాలంలో, యాసంగిలో పండించే పంటల వివరాలను కూడా రాసుకుంటారు. మార్కెటింగ్ సౌకర్యాలు, రైతులు తీసుకున్న రుణా లు, పంటకు చేసిన ఇన్సూరెన్స్ వివరాలను సైతం పొందు పరుస్తారు. రైతులకు ఉన్న పశువుల సంఖ్యను, ఆ రైతుకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ఉందా అనే విషయాన్ని కూడా తెలుసుకుంటారు. ఇక ఈ ప్రాంతంలో ఏ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పితే బా గుంటుందనే అభిప్రాయాన్ని కూడా తీసుకుంటారు. రైతులు కుటుంబంలో ఉండే స్వయం సహాయక సభ్యుల సభ్యుల వివిరాలు, గ్రూప్ వివరాలను సేకరిస్తారు. డ్వాక్రా సంఘాల మహిళల భాగస్వామ్యంతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయనుండగా, వారి ఆజమాయిషీ లోనే అవి కొనసాగుతాయి. కాగా, కూరగాయల సాగు ప్రధానంగా ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

వేదోక్తంగా పాతగుట్టలో కల్యాణోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తులు

యాదాద్రి,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. తుల లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీనారసింహుడు అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేసే అపూర్వ ఘట్టాన్ని అర్చకులు, వేదపండితులు జరిపారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. పండితుల వేదఘోష, భక్తజనం జేజేల మధ్య శుక్రవారం రాత్రి మొదలైన కల్యాణ వేడుక అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ వేడుకను చూడటానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా కల్యాణ మండపంలో విశ్వక్సేన ఆరాధన చేసి స్వస్తి పుణ్యాహవాచనం చేసి సంప్రోక్షణ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నర్సింహామూర్తి, ఈవో ఎన్.గీతలకు కంకణ ధారణ చేశారు. స్వామి వారికి బంగారు యజ్ఞోపవీతధారణ చేశారు. స్వామి, అమ్మవార్లకు మధ్య తెరపత్రం ఉంచి జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూలమాలల దండలను మార్చిడి చేశారు. ప్రవరలను చెప్పి, నూతన వధూవరకులకు కన్యాదానం చేశారు. వేదపండితులు, అర్చక బృందం, పారాయణికులు వేదఘోష నడుమ పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణ వేడుక కొనసాగింది. భక్తులు భాగ్యోత్సవాలుగా భావించే శ్రీలక్ష్మీనరసిం హుడి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన కల్యాణతంతును వీక్షించడానికి అశేష భక్తజనం పాతగుట్టకు తరలివచ్చారు. పెండ్లికొడుకు, పెండ్లి కూతురుగా స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ధన, కనక, వజ్ర, వైడూర్యాల ఆభరణాలు, పట్టువస్త్రాలతో అమ్మవారిని, స్వామి వారిని అలంకరించారు. జై నారసింహా.. జైజై లక్ష్మీనరసింహ అంటూ భక్తుల కోలాటాల మధ్య గజవాహన సేవ ఆసక్తిగా నడిచింది. వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో బ్యాండు మేళాలు, కోలా ట నృత్యాల నడుమ గజవాహనంపై స్వా మి, అమ్మవార్లు ఆధ్యాత్మిక వాతావరణంలో కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, ఆర్డీవో భూపాల్‌రెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ సుధాహేమేందర్‌రెడ్డి, ఆలయ ఈవో ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ వాసుల మెట్రో కల సంపూర్ణం

చివరి కారిడార్‌కు సిఎం కెసిఆర్ పచ్చజెండా

జెబిఎస్ నుంచి ఎంజిబిఎస్ వరకు ఇక పరుగులు

11 కిలోమీటర్ల మార్గంలో 9 మెట్రో స్టేషన్లు

తొలిదశ మెట్రో మార్గాలు పరిపూర్ణం

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ మహానగరానికి మణిహారంలా నిలిచిన మెట్రో ప్రాజెక్టు చివరి కారిడార్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్ పక్కనే నిర్మించిన మెట్రో స్టేషన్‌లో మెట్రో రైలుకు సీఎం శుక్రవారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. తొలి దశ మెట్రో ప్రాజెక్టులో ఇది చివరి దశ కావడంతో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులో ప్రతిపాదించిన 72.కి.మీ. మార్గంలో 69 కి.మీ. మేర మెట్రో సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. దీంతో దేశంలోనే రెండో అతిపెద్ద మెట్రో కారిడార్‌గా రికార్డు సృష్టించింది. మూడు మార్గాల్లో.. ఆరు దిక్కుల నుంచి నగరవాసులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా నిమిషాల్లోనే వెళ్లేందుకు అవకాశం కలగనుంది. జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు 11 కిలోమీటర్ల మార్గంలో 9 మెట్రో స్టేషన్లు ఉన్నాయి. జేబీఎస్-పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ నుంచి మొదలుకొని సికింద్రాబాద్ వెస్ట్, గాంధీ ఆస్పత్రి, ముషీరాబాద్, ఆర్టీసీ ఎక్స్ రోడ్, చిక్కడపల్లి, నారాయణగూడ, సుల్తాన్ బజార్-కోఠి, ఎంజీబీఎస్ స్టేషన్లు ఉన్నాయి. జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వెళ్లడానికి 16 నిముషాల సమయం పడుతుంది. ఈ కార్యక్రమాని మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, తలసాని, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, సీఎస్ సోమేష్‌కుమార్, మేయర్ రామ్మోహన్, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో జేబీఎస్ వద్ద వాతావరణం కోలాహలంగా ఉంది. 2017 నవంబర్ 29న హైదరాబాద్ మహానగరంలో తొలిసారి మెట్రో సేవలను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. తర్వాత దశల వారీగా అమీర్‌పేట-ఎల్బీనగర్, అమీర్‌పేట-హైటెక్ సిటీ, హైటెక్ సిటీ-రాయదుర్గం మార్గాల్లో మూడుసార్లు మెట్రో సేవలను నాటి గవర్నర్ నరసింహన్‌తో పాటు మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మొత్తంగా భాగ్యనగరవాసుల కల సంపూర్ణమైంది. మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులో ప్రతిపాదించిన 72 కి.మీ మార్గంలో 69కి.మీ మేర మెట్రో సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. దీంతో దేశంలోనే రెండో అతిపెద్ద మెట్రో కారిడార్‌గా నిలిచింది. ఎంజీబీఎస్ స్టేషన్ నిర్మాణం పలు ప్రత్యేకతలతో నిర్మించారు. 58 పిల్లర్లు, 6 గ్రిడ్స్‌తో పూర్తిస్థాయి స్టీల్, నాణ్యమైన సిమెంట్ కాంక్రీట్‌తో స్టేషన్‌ను నిర్మించారు. ఎల్బీనగర్

మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

యాదాద్రి భువనగిరి ,ఫిబ్రవరి8 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని ఆలేరులో ఈ నెల 1వ తేదీన హత్యకు గురైన నీలమ్మ అనే మహిళ కేసును పోలీసులు ఛేదించారు. బంగారం తాకట్టు పెట్టిన రసీదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సమీప బంధువే హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉదయం జనగామలో నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు ఎడ్ల భాస్కర్‌ను డీసీపీ నారాయణరెడ్డి మీడియా ముందు హాజరు పరిచారు. నిందితుడి నుంచి 3 తులాల బంగారు గొలుసు, చెవి దిద్దులు, రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆరునెలల్లోపే తీర్పులు.. అభినందనీయం :కేటీఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు మహిళలు, చిన్నారులకు సంబంధించిన మూడు దారుణ కేసుల్లో ఆరు నెలల్లోపే తీర్పులు ఇచ్చాయని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ కేసుల్లో ఐదుగురు నిందితులకూ ఉరిశిక్ష విధించారని గుర్తు చేశారు. ఆయా కేసుల అంశంలో సత్వర న్యాయం జరిగేలా ప్రయత్నించిన న్యాయ, హోంశాఖ అధికారులతో పాటు న్యాయవ్యవస్థను మంత్రి అభినందించారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో సమత, యాదాద్రి జిల్లాలోని హాజీపూర్‌లో వరుస హత్యలు, వరంగల్ జిల్లాలో చిన్నారిపై హత్యాచారం కేసుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు సత్వర విచారణ జరిపి దోషులకు ఉరిశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

బాసర ట్రిపుల్ ఐటిలో విషాదం

ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థి మృతి

నిజామాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): నిర్మల్ ట్రిపుల్ ఐటిలో చదువతూ ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి సంజయ్ మృతి చెందాడు. సంజయ్ నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో బుధవారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్ గ్రామానికి చెందిన బోండ్ల సంజయ్ ట్రిపుల్ ఐటీలో చదువుతున్నాడు. భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకుయత్నించాడు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కళాశాలలో సంజయ్ మరో విద్యార్థి సాయిచరణ్‌లు ఘర్షణ పడ్డారు. ఈ విషయంలో సాయిచరణ్, సంజయ్‌పై కళాశాల అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు వీరిని ప్రత్యేక గదిలో ఉంచారు. బుధవారం ఉదయం సంజయ్‌ను విచారించే సమయంలో మరుగుదొడ్డికి వెళ్లి వస్తానని చెప్పి నాలుగంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది చికిత్స కోసం తొలుత నిజామాబాద్‌లోని ప్రగతి ఆస్పతికి తరలించారు. తర్వాత సంజయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సంజయ్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొలిప్యాక్ గ్రామానికి చెందిన బోండ్ల శ్రీనివాస్, సత్తెమ్మల కుమారుడు సంజయ్. వీరికి ఇద్దరు కూతుళ్లు కూడా ఉన్నారు. శ్రీనివాస్ గీత కార్మికుడిగా పని చే స్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి సత్తెమ్మ బీడీలు చుడుతుంది. సంజయ్‌ను ఎలా గైనా బాగా చదివించాలని ఆశించారు. అనుకోకుండా సంజయ్ ఆత్మహత్యకు పాల్పడడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. సంజయ్ అందరితో స్నేహపూర్వకంగా ఉండేవాడని స్నేహితులు గుర్తు చేసుకుంటున్నారు.

సహకారంలోనూ మాదే విజయం

-ప్రజల పక్షాన నిలబడడంతోనే వరుస విజయాలు

యాదాద్రి,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): వచ్చే సహకార ఎన్నికల్లోనూ టిఆర్ఎస్ మద్దతుదారులదే విజయమని ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఏవైనా గెలుపు గులాబీదళానిదే అని రుజువయ్యిందన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ..మరో వైపు అన్ని ఎన్నికల్లో వరసు విజయాలను ప్రజలు కట్టబెడతున్నారని అన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే టీఆర్ఎస్ కేంద్రబిందువుగా నిలుస్తున్నదని అన్నారు. సీఎం కేసీఆర్ ఆరేండ్ల పాలనను ఇతర రాష్ట్రాల ప్రజలు ఆదర్శంగా తీసుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. అక్కడి ప్రజలు మాకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కావాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా సీఎం కేసీఆర్ పాలనవైపు చూస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలోనే కృష్ణా, గోదావరి జలాల పథకానికి శ్రీకారం చుట్టే క్రమంలో నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ బాధలు తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ ఇక్కడ పార్కు ఏర్పాటు చేయాలని అప్పట్లో సూచించారన్నారు. ప్రతిపక్ష రాజకీయ నేతలు వద్దంటున్నా వారితో మాట్లాడి ఏర్పాటు చేశానని ఆయన గుర్తు చేశారు. ఇదంతా 14 సంవత్సరాల ఉద్యమ పోరాటం.. ఆరేండ్ల పాలనతోనే సాధ్యమైందన్నారు. ఎన్నికలు ఎన్నిసార్లు వచ్చినా మళ్లీమళ్లీ టీఆర్ఎస్ పార్టీకే ప్రజలు పట్టం కడుతున్నారని ఆమెస్పష్టం చేశారు. ఆయనపై ప్రజలకు ఉన్న విశ్వాసంతోనే అన్ని ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. అందులోభాగంగా125 మున్సిపాలిటీల్లో గులాబీజెండా ఎగిరిందన్నారు. 32 జడ్పీ చైర్మన్లు సైతం కైవసం చేసుకొని దేశంలోనే రికార్డు సృష్టించామన్నారు. అంతేకాకుండా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గాలు రాజకీయాలకతీతంగా పనిచేయాలన్నారు. ఎవరైనా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల విజ్ఞప్తి మేరకు వార్డు కౌన్సెలర్లను తొలగించే అవకాశం కూడా నూతన మున్సిపాలిటీ చట్టంలో ఉందన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. పేదవర్గాల సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించాలన్నారు.

ఉడాన్ సేవలు విస్తరిస్తున్న ట్రూజెట్

బెంగళూరు నుంచి బీదర్‌కు విమాన సర్వీసు

బీదర్ వాసులకు చేరువ కానున్న బెంగళూరు

బెంగళూరు-బీదర్ విమాన సర్వీసును ప్రారంభించిన యెడ్యూరప్ప

రోజూ బెంగళూరు-బీదర్ బెంగళూరు మధ్య విమాన సేవలు

బెంగళూరు,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): ఉడాన్ నెట్‌వర్క్ సేవల విస్తరణలో భాగంగా హైదరాబాద్ టర్బో మేఘా ఎయిర్‌వేస్‌కు చెందిన ట్రూజెట్ కొత్తగా ఈశాన్య కర్ణాటకలోని బీదర్ నుంచి విమాన సేవలు ప్రారంభించింది. బీదర్ నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరు మధ్య శుక్రవారం నుంచి ప్రతీ రోజు విమానసేవలు అందుబాటులోకి వచ్చాయి. కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్పశుక్రవారం బెంగళూరు విమానాశ్రయంలో ఈ సర్వీసు ప్రారంభించారు. బెంగళూరులో ట్రూజెట్ సర్వీసు ప్రారంభించిన అనంతరం అదే విమానంలో ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు బీదర్ వరకు ప్రయాణించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ బెంగళూరు విమానాశ్రయం నుంచి బీదర్‌కు కేవలం గంటా 40 నిమిషాల్లోనే చేరుకున్నామని, సాధారణంగా బెంగళూరు నుంచి బస్సులో బీదర్‌కు చేరుకోవాలంటే 12 గంటల ప్రయాణం అవుతుందన్నారు. ట్రూజెట్ విమాన సర్వీసుల వల్ల ప్రయాణ దూరం భారం తగ్గిందని విమాన సర్వీసుల పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. ఇక ట్రూజెట్ నెట్‌వర్క్‌లో బీదర్ 24వ స్టేషన్ కాబోతోంది. ప్రాంతీయ అనుసంధాన పథకం (ఆర్సీఎస్)- ఉడే దేశ్కా ఆమ్ నాగరిక్ (ఉడాన్), సామాన్య మానవులు కూడా విమానాల్లో ప్రయాణించాలన్న ప్రధానమంతి ప్రయత్నాల్లో భాగంగా ట్రూజెట్ విమానాల్లో 65 శాతానికి పైగా ప్రాంతీయ విమానాశ్రయాలకు అనుసంధానమై ఉన్నాయి. ఆర్సీఎస్ ఎ, ఎఎ, ఎఎఎ కింద తనకు అప్పగించిన మార్గాల్లో పూర్తిగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏకైక సంస్థ ట్రూజెట్. ఈ సందర్భంగా టర్బో మేఘా ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ 'మా మొదటి ప్రయాణాన్ని జూలై 12, 2015న మొదలపెట్టిన నాటి నుంచి మేము చాలా దూరం ప్రయాణించాం. భారత్‌లోని ప్రథమశ్రేణి నగరాల నుంచి సామాజిక-ఆర్థిక అభివృద్ధిని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలన్న జాతి ఆకాంక్షలను మేము నెరవేర్చుతున్నామని గొప్పగా చెప్పుకుంటున్నాం. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విమాన సేవలు అందించడం ద్వారా ఆ ప్రాంతాల్లో వ్యాపారానికి, పర్యటక అభివృద్ధికి మేము దోహదపడుతున్నాం. విమాన అనుసంధానం అన్నది ఆర్థిక వ్యవస్థకు అండగా నిలవడమే కాకుండా ఉపాధి కల్పనకు సహకరిస్తుంది' అని అన్నారు. సీఈఓ కల్నల్ ఎల్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, ప్రాంతీయ విమాన అనుసంధానంలో బలమైన శక్తిగా ట్రూజెట్ నిలుస్తుంది. నాలుగేళ్ల స్వల్ప వ్యవధిలో మా నెట్‌వర్క్‌ను 24స్టేషన్లకు విస్తరించగలిగాం. దేశంలో ఆర్థికశక్తులుగా ఎదుగుతున్న ప్రాంతాల్లో బలమైన ప్రాంతీయ విమానయాన సంస్థగా ఎదిగేందుకు సుస్థిర అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించామన్నారు. కాగా బెంగళూరు-బీదర్ బెంగళూరు మధ్య కొత్త సర్వీసు ప్రారంభించిన సందర్భంగా ట్రూజెట్ నాలుగు రోజుల పాటు టికెట్ బేస్ ధరను రూ.699 గా అందిస్తోంది

వ్యాన్‌లో మంటలు..విద్యార్థులకు తప్పిన ముప్పు

నారాయణపేట,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): నర్వ మండలం కుమార్లింగంపల్లి గ్రామానికి చెందిన కొంతమంది విద్యార్థులు పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు. తమ గ్రామం నుంచి ఆత్మకూర్‌కు బయల్దేరిన వ్యాన్‌లో ఏడుగురు విద్యార్థులు, మరో ముగ్గురు ప్రయాణికులు ఎక్కారు. వ్యాన్ బయల్దేరిన కాసేపటికే మార్గమధ్యలో ఇంజిన్‌లో నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్.. వ్యాన్‌ను ఆపి విద్యార్థులను, ముగ్గురు ప్రయాణికులను ప్రాణాలతో కాపాడారు. అగ్నిప్రమాదం కారణంగా వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. పెనుప్రమాదం నుంచి బయటపడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

కొనసాగుతున్న గ్రీన్ ఛాలెంజ్

-మొక్కలునాటిన సిటీసివిల్ కోర్టు న్యాయవాదులు

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రీన్ ఛాలెంజ్ విజయవంతంగా కొనసాగుతున్నది. సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు గ్రీన్ ఛాలెంజ్ స్వీకరించి మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులతో మొక్కలు నాటించారు. ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఛాలెంజ్ ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి న్యాయవాది ఒక మొక్కను నాటాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ నేతలు గోవర్ధన్ రెడ్డి, ఉపేందర్ పిలుపు నిచ్చారు.

ఈ సందర్భంగా సిటి సివిల్ కోర్టు అధ్యక్షుడు జగదీశ్వర్ రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఎంపీ సంతోష్ కుమార్ తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణగా ఏర్పాటు చేయడానికి కంకణం కట్టుకున్నారని అన్నారు. మొక్కలను మనం కాపాడితే మొక్కలు మన ప్రాణాన్ని కాపాడుతాయి. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అధికార ప్రతినిధి ఉపేందర్ కోరారు. ప్రపంచం గ్లోబల్ వార్మింగ్ తో బాధపడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో అనేక పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకున్న మొట్టమొదటి సీఎం కేసీఆర్ అని అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ కొంతం గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు అధ్యక్షుడు జగదీశ్వర్ రావు, కార్యదర్శి జానకి రాములు, అడ్వకేట్ సొసైటీ సెక్రెటరీ కె.తిరుపతయ్య, అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ కొంతం గోవర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధి ఉపేందర్, న్యాయవాది జేఏసీ మనిక్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన లాయర్లు

ఎపిలో మహిళల భద్రతలకు పెద్దపీట

దిశ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన సిఎం జగన్

సత్వర న్యాయం అందించడమే లక్ష్యం అన్న సిఎం

రాజమండ్రి,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): మహిళలు, బాలల భద్రత కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'దిశ' చట్టం అమలులో భాగంగా రాజమహేంద్రవరంలోని 'దిశ' తొలి పోలీస్ స్టేషన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన దిశ ప్రత్యేక పోలీసు స్టేషనును పరిశీలించారు. 'దిశ' పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించడం గర్వంగా ఉందని ఈ సందర్భంగా సిఎం జగన్ వ్యాఖ్యానించారు. రాజమండ్రిలో నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన సదస్సులో జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అక్కాచెల్లెళ్లకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నేరస్థులతో నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో దిశ చట్టం తీసుకొచ్చామన్నారు. 'దిశ' చట్టం దేశ చరిత్రలోనే ఒక కొత్త అధ్యాయమని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలే తమ తొలి ప్రాధాన్య అంశమన్నారు. హైదరాబాద్‌లో జరిగిన దిశ ఘటన చాలా బాధాకరమని.. నలుగురు కలిసి తాగితే ఏం చేస్తారో అర్థం కావడంలేదన్నారు. మహిళలకు భద్రత లేదనడానికి దిశ ఘటన ఓ ఉదాహరణ అన్న ఆయన.. నిర్భయ ఘటనలో దోషులకు ఇప్పటికీ శిక్ష పడలేదన్నారు. త్వరగా న్యాయం జరిగి, శిక్షలు వెంటనే పడితే వ్యవస్థలో భయం పెరుగుతుందని.. 8 ఏళ్లయినా నిర్భయ నిందితులకు శిక్ష పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు విచారణకు సంవత్సరాలకు సంవత్సరాలు పడితే.. న్యాయస్థానాలపై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. వ్యవస్థలో మార్పు తేవాలన్న ఆలోచనతోనే దిశ చట్టం తెచ్చామని జగన్ వ్యాఖ్యానించారు. దిశ బిల్లు... త్వరలో చట్టం రూపంలోకి వస్తుందని ఆశిస్తున్నానన్నారు. దిశ చట్టం ప్రకారం మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా... రెడ్ హ్యాండెడ్ కేసుల్లో ఏడురోజుల్లో దర్యాప్తు.. 14రోజుల్లో విచారణ చేసి ఉరిశిక్ష వేసేలా చట్టాన్ని రూపొందించామన్నారు. 13 జిల్లాలో దిశ కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖ, తిరుపతిలో కొత్త ఫోరెన్సిక్ ల్యాబ్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దిశ యాప్ ద్వారా వెనువెంటనే చర్యలు తీసుకొనే వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్లే స్టోర్ లో

ఈశాన్యంలో కొత్త చిగురు

శరణార్థులుగా మారిన వేలాది మందికి స్వేచ్ఛ
బోడో శాంతి ఒప్పందంతో సంపూర్ణ గౌరవం దక్కింది
గత పాలకులు ఈశాన్యాన్ని విస్మరించారు
కోక్రజార్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ
నృత్యాలతో ఆనందం వ్యక్తం చేసిన అస్సామీలు

గౌహతి,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): హింస వల్ల శరణార్థులగా మారిన వేలాది మంది ఈశాన్య రాష్ట్ర ప్రజలు.. ఇప్పుడు కొత్త జీవితాన్ని ప్రారంభించినట్లు ప్రధాని మోడీ చెప్పారు. సంపూర్ణ గౌరవం, హుందా తనంతో వాళ్లకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రధాని అన్నారు. బోడో ల్యాండ్ ఉద్యమంలో పాల్గొని, ప్రజాజీవితంలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్న ట్లు మోడీ చెప్పారు. ప్రధాని మోడీ శు క్రవారం అస్సాంలోని కోక్రజార్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. బోడోలతో ఇటీవల శాంతి ఒప్పందం కుదిరి న నేపథ్యంలో.. అక్కడ భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు అయిదు దశా బ్దాల తర్వాత, బోడో ఉద్యమంతో సంబంధం ఉన్న వారికి గౌరవం దక్కిందన్నారు. గత పాలకులు ఈశాన్యాన్ని విస్మరి ంచారని, కానీ తాము బోడో ఒప్పందాన్ని నిజం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన మరోసారి గుర్తు చేశారు. కర్రలతో మోదీని కొట్టేందుకు జనం సిద్ధంగా ఉందని రాహుల్ అన్న విషయం తెలిసిందే. అయితే ఆ దెబ్బలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉ న్నామని, పెద్దఎత్తున్న మహిళల అండ తనకు ఉందని మోదీ అన్నారు. పార్లమెంటులో భారత పౌరసత్వ సవరణ చట్టం పాస్ అయి చట్టంగా రూపుదాల్చిన తర్వాత తొలిసారిగా అస్సాం పర్యటనకు వచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. అస్సాంలో శాంతిమంత్రం కోసమే ఆలోచించి చారిత్రాత్మక బోడో ఒప్పందం కుదుర్చుకున్నా మని ప్రధాని మోడీ చెప్పారు. కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రాంతం హింస, ఘర్షణలతో అట్టుడికిపోయిందని చెప్పారు. అంతేకాదు కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అయితే ఈ సమస్యలను గత ప్రభుత్వాలు పరిష్కరించడ లో విఫలమ య్యాయని మోడీ చెప్పారు. తమ ప్రభుత్వమే ఈ కార్యక్రమానికి పూనుకుందని వివరించా రు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఈశాన్య రాష్ట్రాలే ఎక్కువగా నష్టపోయాయని చెప్పారు. కోక్రఝార్‌లో పర్యటించిన ప్రధాని మోడీ బోడో ఒప్పందం జరగడం ఒక వేడుకలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బోడో స్టూడెంట్స్ యూనియన్‌కు చెందిన యువత ఒప్పందంకు సహకరించడాన్ని ప్రధాని అభినందించారు. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చడంలో కృషి చేసిన నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడో లాండ్, బీటీసీ చీఫ్ హగ్రామ మొహిలారీతో పాటు అస్సాం ప్రభుత్వంకు ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. బోడో ఒప్పందం కుదరడంతో దశాబ్దాలుగా ఉన్న సమస్య అంతమవుతుందని చెప్పారు. ఈ ప్రాంతం ఇకపై అభివృద్ధి బాటలో పయనిస్తుందని వెల్లడించారు. అస్సాంలోని బోడో డామినేట్ ప్రాంతంలో శాంతి నెలకొనాలనే ఉద్దేశంతో జనవరి 27న కేంద్ర ప్రభుత్వం నేషనల్ డెమొక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్, ఆల్ బోడో స్టూడెంట్స్ యూనియన్ , పౌరసమాజ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్‌డీఎఫ్‌బీకి చెందిన 1615 మంది ఆయుధాలను సరెండర్ చేశారు. ఒప్పందం జరిగాక రెండురోజుల్లో జనజీవన స్రవంతిలో కలిశారు. ఇదిలా ఉంటే 1993 మరియు 2003లో జరిగిన బీటీఏడీ శాంతి ఒప్పంద ం పెద్దగా పనిచేయలేదని ప్రధాని మోడీ గుర్తు చేశారు. ఈశాన్య రాష్ట్రాలపట్ల గత ప్రభుత్వాల్లా కాకుండా తమ ప్రభుత్వం ఎంతో ప్రేమ చూపుతోందని ప్రధాని మోడీ అన్నారు. ఒకప్పుడు కేంద్రం ఎలాంటి నిధులు ఇస్తుందో అని ఈశాన్య రాష్ట్రాలు ఎదురు చూసేవని .. కానీ ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలు దేశాభివృద్ధిలో కీలకంగా మారా యని అన్నారు. ఇక శాంతియుత వాతావ రణం కోసం కృషి చేయాలని ఇకపై ఇక్కడ హింసకు తావులేకుండా చేయాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. బోడో ల్యాండ్ ఉ ద్యమంలో పాల్గొని, ప్రజాజీవిత ంలోకి వస్తున్న ప్రతీ ఒక్కరికి ఈ సందర్భంగా ప్రధా ని మోదీ స్వాగతం పలికారు. ప్రధాని మో దీ సభ నేపథ్యంలో అస్సామీల డ్యాన్సులతో సందడి చేశారు. అస్సామీలు చేతిలో త్రివర్ణపతాకాలను పట్టుకుని సంప్రదాయ జానపదపాటలకు నృత్యాలు చేశారు. సభకు వచ్చినవారంతా చిన్నాపెద్దా తేడాలేకుండా కుర్చీల్లో నుంచి పైకి లేచి చిందులేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ ంలో సిఎం సోనేవాల్ పాల్గొన్నారు.

అక్కన్నపేట కాల్పుల్లో కొత్తకోణం

సదానందానికి మావోలతో సంబంధా లపై ఆరా

సిద్దిపేట,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): అక్కన్నపేట కాల్పుల ఘటనలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. కాల్పులు జరిపిన సదానందానికి మావోయిస్టులతో సంబంధా లున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మూడేళ్ల క్రితం హుస్నాబాద్ పీఎస్ నుంచి ఏకే 47, 2 కార్బన్ గన్లు మాయమయ్యాయి. సదానందం దగ్గర ఉన్న ఏకే 47 అదేనా అని అనుమానిస్తున్నారు. సదానందం కోసం పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి అక్కన్నపేటలో తుపాకి మోతలు సంచలనం రేపిన విషయం తెలిసిందే. గుంటి గంగరాజు అనే వ్యక్తిపై దేవుని సదానందం అనే వ్యక్తి ఈ కాల్పులు జరిపాడు. మిస్ ్ ఫైర్ కావడంతో గంగరాజుకు ప్రాణా పాయం తప్పింది. ప్రస్తుతం సదానందం పరారీలో ఉన్నాడు. సిద్దిపేట, హుస్నాబాద్ ఏసీపీలు, క్లూస్ టీం సహాయంతో సదానందం ఇంటిని తనిఖీ చేశారు. పేలిన తూటాలను స్వాధీనం చేసుకున్నారు. తల్వార్ కత్తి, తుపాకి బెల్ట్, బాడిషా కత్తి, రెండు ఫోన్లు, రెండు బ్యాంక్ అకౌంట్ల ఏటీఎంలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి నుంచి అక్కన్నపేట పోలీసుల ఆధీనంలో ఉంది.

టిడిఆర్‌తో భూసేకరణ సులువు

నగరంలో తప్పనున్న తిప్పలు
టిడిఆర్ బ్యాంక్‌ను ప్రారంభించిన కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)బ్యాంకును మున్సిపల్‌శాఖ మంత్రి కె. తారక రామారావు శుక్రవారం ప్రారంభించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ, నాలా, లేక్ డెవలప్‌మెంట్ పనులకు భూసేకరణ చట్టం కింద సేకరించినబ ాధములకు సంబంధించి యాజమానికి జారీచేసిన టీడీఆర్ సర్టిఫికెట్స్ డిమాండ్ పెంచి వినియోగించేందుకు, టీడీఆర్ అప్లికేషన్‌ను జీహెచ్ఎంసి రూపొందింది. ఎంసిహెచ్ఆర్‌డిలో జీహెచ్ఎంసి, హెచ్ఎండిఏ ప్లానింగ్ అధికారులతో మంత్రి కేటీఆర్ సమావేశం నిర్వహించారు. 2000 సంవత్సరంలో టీడీఆర్‌ను ప్రవేశ పెట్టినప్పటికీ 2017 వరకూ భూ యాజమానుల నుంచి ఆశించిన స్పందన లభించలేదు. 2017 డిసెంబర్‌లో ప్రకటించిన నూతన టీడీఆర్ ఉత్తర్వుల ప్రకారం మాస్టర్‌ప్లాన్ కింద రోడ్ల వెడల్పు కోసం సేకరించే భూములకు 400 శాతం సరస్సులు, నాలాలు, ఇతర నీటి వనరుల సంరక్షణ, అభివృద్ధికి సేకరించే భూములకు 200శాతం టీడీఆర్‌ను పెంచారు. నూతన టీడీఆర్‌తో జీహెచ్ఎం సి, ఎన్ఆర్‌డిపి కింద చేపట్టిన పనులు, లింక్ రోడ్లు, మిస్సింగ్ లింక్‌రోడ్ల అభివృద్ధి పనులకు భూసేకరణ పక్రియ వేగవంత మైంది. యాజమానులతో సంప్రదించి టీడీఆర్‌లను జారీ చేయడం వల్ల జీహె చ్ఎంసికి ఆర్థిక భారం కూడా తగ్గుతుందిదని అధికారులు తెలిపారు. అలాగే టీడీఆర్ సర్టిఫికెట్‌లకు డిమాండ్‌ను పెంచేందుకు వాటి వినియోగ పరిధినివ హెచ్ఎండిఏ పరిధిలో ఉన్న ఓఆర్ఆర్ వరకూ ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం టీడీఆర్ సర్టిఫికెట్‌లను మాన్యువల్ పద్ధతిలో జారీచేయడంతోపాటు వియోగిం చడం జరుగుతోంది. దానిని యాజమానా న్యానికి సౌలభ్యంగా ఉండేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా వినియోగించేందుకు జీహెచ్ఎంసి ప్రత్యేకంగా టీడీఆర్ బ్యాంకు అప్లికేషన్‌ను అభివృద్ధి చేసింది. ఆన్‌లైన్ టీడీఆర్ బ్యాంకు అప్లికేషన్‌లో జారీ చేసిన టీడీఆర్ సర్టిఫికేట్‌ల వివరాలు అందుబ ాటులో ఉన్న టీడీఆర్ సర్టిఫికెట్‌ల సమా చారం లభిస్తుంది. టీడీఆర్ సర్టిఫికెట్ దారులకు, సర్టిఫికెట్‌ల కొనుగోలు దారులకు టీడీఆర్ బ్యాంకు వెసులుబాటు కల్పిస్తుంది. ఈసమావేశంలో మేయర్ బొంతు రామ్మో హన్, పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్, జీహెచ్ఎంసి కమిషనర్‌లోకేష్ కుమార్, హెచ్ఎండిఏ ఎ÷–లానింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్కార్ బరిలో తొమ్మిది చిత్రాలు..

హైదరాబాద్, ఫిబ్రవరి 8 :సినీ పరిశ్రమలో అతి పెద్ద పండుగగా చెప్పుకొనే ఆస్కార్ అవార్డుల వేడుకకి సమయం ఆసన్నమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖులు ఈ వేడుక కోసం కళ్ళల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురు చూస్తుంటారు. ఆస్కార్ అవార్డ్ అందుకోవాలనేది ప్రతి నటీనటుల కల. 2020 సంవత్సరానికి గాను ఆస్కార్ అవార్డ్ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 9న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరపనున్నారు. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం ఈ వేడుక ఘనంగా జరగనుంది. ఆస్కార్ కిరీటం అందుకునేందుకు మొత్తం తొమ్మిది చిత్రాలు బరిలో నిలిచాయి. వాటిలో జోకర్, పారాసైట్, 1917, మ్యారేజ్ స్టోరీ, ది ఐరిష్ మ్యాన్, జోజో రాబిట్, లిటిల్ ఉ మెన్, ఫోర్డ్ వెర్సర్ ఫెరారి, ఒన్స్ ఎపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్ చిత్రాలు పోటీ పడుతున్నాయి.

జోకర్

జోకర్‌ని ప్రధాన పాత్రగా మార్చి ఫిలిప్స్ తెరకెక్కించిన అద్భుతమైన చిత్రం జోకర్. జోకర్ పాత్రలో జోక్విన్ ఫోనిక్స్ అద్భుతంగా నటించారు. జోకర్ ప్రవర్తన హింసాయుతంగా ఎందుకు మారింది,విద్వేషానికి దారి తీసిన పరిస్థితులని గురించి చర్చిస్తూ ఈ సినిమాని అద్భుతంగా తెరకెక్కించారు. వంద కోట్ల డాలర్స్‌కి పైగా వసూళ్ళు రాబట్టిన ఈ చిత్రం వెనిస్ చిత్రోత్సవంలో బెస్ట్ మూవీ అవార్డ్ గెలుచుకుంది

పారాసైట్

పేద, ధనిక అంతరాల వలన సమాజంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడతాయో పారా సైట్ అనే చిత్రం ద్వారా దర్శకుడు బాంగ్ జూన్ హో అద్భుతంగా తెరకెక్కించారు. కేన్స్ చిత్రోత్సవంలో బెస్ట్ మూవీ అవార్డ్ అందుకున్న ఈ చిత్రం ఆస్కార్ రేసులోను నిలిచింది. ఉత్తమ విదేశీ భాషా చిత్రంగా గోల్డెన్ గ్లోబ్ పురస్కారం కూడా ఈ చిత్రానికి దక్కింది. ఈ కొరియన్ చిత్రం ఆస్కార్ సాధిస్తుందని విశ్లేషకులు అంటున్నారు.

1917

మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో బ్రిటన్ దర్శకుడు శామ్ మెండిస్ తెరకెక్కించిన చిత్రం 1917. జార్జ్ మెక్ కే, డీన్ చార్లెస్ చాంప్ మ్యాన్ ప్రధాన పాత్రలలో రూపొందిన ఈ చిత్రం ఉత్తమ చిత్రంతో పాటు పదకొండు ఆస్కార్ నామినేషన్స్ పొందింది. పలు గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ పొందిన ఈ చిత్రం కూడా ఆస్కార్ కిరీటం అందుకునే ఛాన్స్ ఉందని అంటున్నారు. శత్రు దేశం పన్నిన పన్నాగంలో తమ సైనికులు 1600 మంది ప్రాణాలు కోల్పోయే ఛాన్స్ ఉండగా, విషయాన్ని సైనికులకి చేరవేసే బాధ్యతలని ఇద్దరు సైనికులు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం ప్రేక్షకులకి మంచి వినోదం అందించింది.

మ్యారేజ్ స్టోరీ

విడాకుల కోసం ఎదురు చూస్తున్న ఓ జంట కథతో తెరకెక్కిన చిత్రం మ్యారేజ్ స్టోరీ. నోహ్ బవుమ్‌బచ్ చిత్రాన్ని తెరకెక్కించగా , ఆడమ్ డ్రైవర్, స్లార్లెట్ జాన్సన్ ప్రధాన పాత్రలు పోషించారు. భార్య భర్తల మధ్య ఎలాంటి సమస్యలు వచ్చిన వారే సాల్వ్ చేసుకోవాలే తప్ప మధ్యలో మరో వ్యక్తిని తీసుకువచ్చి సమస్యని రెట్టింపు చేయకూడదనే విషయాన్ని చాలా హృద్యంగా చూపించారు దర్శకుడు. అమెరికన్ ఫిలిం ఇనిస్టిట్యూట్, నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ వంటి సంస్థలు ఈ చిత్రాన్ని కొనియాడాయి.

ది ఐరిష్ మ్యాన్

క్రైమ్ నేపథ్యంలో తెరకెక్కి బాక్సాఫీస్ దగ్గర మంచి హిట్ కొట్టిన చిత్రం ది ఐరిష్ మ్యాన్. మార్టిన్ స్కోర్సెసె ఈ చిత్రాన్ని ఐ హార్ద్ యు పెయింట్ హౌసెస్ అనే పుస్తకం ఆధారంగా తెరకెక్కించారు. ఇందులో రాబర్ట్ డి నీరో, అల్ పసినో, జో పెస్సి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడుతో సహా 10 ఆస్కార్ నామినేషన్స్ పొందింది.

జోజో రాబిట్

జర్మనీ నియంత హిట్లర్ ఓ పిల్లాడికి పరిచయమై, పిల్లాడు కావలసినప్పుడల్లా అతనికి ప్రత్యక్షమై కావలసిన కోరికలన్నీ తీరిస్తే ఎలా ఉంటుందో జోజో రాబిట్ చిత్రం ద్వారా చూపించాడు దర్శకుడు టైకా వైటిటి. రోమన్ గ్రిఫిన్ డేవిస్, థామసిన్ మెక్ కెంజీ ప్రధాన పాత్రలలో రూపొందిన ఈ చిత్రం కామెడీతో పాటు మంచి సందేశాన్ని అందించింది.

లిటిల్ ఉమెన్

1868లో ప్రచురితమైన నవల ఆధారంగా తెరకెక్కిన చిత్రం లిటిల్ ఉమెన్. నలుగురు అక్కాచెల్లెళ్లు తమ జీవితంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నారనేది ఈ చిత్రం ద్వారా చూపించారు దర్శకుడు గ్రెటా గెర్విగ్. ఇందులో సవొఇర్సె రోనన్, ఎమ్మా వాట్సన్, ఫ్లోరెన్స్ పుఘ్, ఎలిజా స్కాన్‌లెన్ ప్రధాన పాత్రలలో నటించారు.

ఫోర్డ్ వెర్సస్ ఫెరారి

ఆటో మొబైల్ సంస్థలు ఫోర్డ్, ఫెరారి మధ్య రేసింగ్ కారు విషయంలో నెలకొన్న పోటీ ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఫోర్డ్ వెర్సస్ ఫెరారి. 1963లో ఫోర్డ్ యజమాని హెన్రీ ఫోర్డ్ , ఫెరారి కంపెనీ కొనుగోలు చేసేందుకు ఆ సంస్థ యజమాని ఎంజో ఫెరారితో డిస్కస్ చేస్తాడు. కాని ఎంజో అవమానిస్తూ తిరస్కరిస్తాడు. అవమానాన్ని మనసుకు తీసుకున్న హెన్రీ ఫెరారికి ఢీటుగా అత్యాధునిక కారుని తయారు చేయాలని భావిస్తాడు. ఈ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రంలో మాట్ డామన్, క్రిస్టియన్ బాలె ముఖ్య పాత్రలు పోషించారు. జేమ్స్ మ్యాన్ గోల్డ్ తెరకెక్కించారు

ఒన్స్ ఎపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్

హాలీవుడ్ చిత్ర సీమకి నివాళిగా దర్శకుడు క్వెంటిన్ టరంటినో తెరకెక్కించిన చిత్రం ఒన్స్ ఎపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్. లియోనార్డో డికాప్రియో, బ్రాడ్‌పిట్, మార్గట్ రోబీ ప్రధన పాత్రలలో తెరకెక్కిన ఈ చిత్రంలో టీవీ నటుడు తన కెరీర్ ముగిసిపోతుందనే భయంతో ఏం చేస్తాడు అనేది ఆసక్తిగా చూపించారు. తన లాంటి డూప్‌ని క్రియేట్ చేసి హాలీవుడ్‌లో తన అదృష్టాన్ని ఎలా పరీక్షించుకుంటాడు అనేది చిత్రంలో ఆసక్తిగా చూపించారు. మొత్తంగా వడబోసిన తొమ్మిది చిత్రాలలో ఏ చిత్రంకి ఆస్కార్ దక్కుతుందో తెలియాలంటే కొన్ని గంటలు వేచి చూడక తప్పదు.

వివేకా కుటుంబానికి రక్షణెళిది..?

తగిన రక్షణ కల్పించాలని టీడీపీ డిమాండ్

మంగళగిరి,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుటుంబ సభ్యులకు రక్షణ ఎక్కడుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రశ్నించారు. ప్రభుత్వం వారికి అవసరమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వివేకా హత్య కేసుకు సంబంధించిన పిటిషన్‌ను సీఎం జగన్ వెనక్కి తీసుకోవడం ఆశ్చర్యంగా ఉ ందన్నారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాల యంలో మీడియాతో ఆయన మాట్లాడారు. గతంలో వివేకా హత్య కేసును సీబీఐకి అప్పగించాలని కోరిన జగన్.. గురువారం సదరు పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారని విమర్శించారు. హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను ఎందుకు వెనక్కు తీసుకున్నారో చెప్పాలని వర్ల డిమాండ్ చేశారు. కేసు విచారణకు వచ్చే సమయంలో రిట్‌ను వెనక్కి తీసుకోవడమేంటన్నారు. సీబీఐ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశిస్తే అంతఃపుర రహస్యాలు బయటకొస్తాయనుకున్నారా? అని వర్ల ప్రశ్నించారు. నిందితులను కాపాడేందుకు జగన్ తన పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారా? అని వర్ల అనుమానం వ్యక్తం చేశారు. 'సీఎం వ్యవహారశైలిని రాష్ట్ర ప్రజలు గమనిసు న్నారు. వివేకా కేసులో అమాయకులను ఇరికించాలని చూస్తున్నారని ఆయన కుమార్తె సునీత ఆరోపించారు. వివేకా కుటుంబ సభ్యులకు రక్షణెళిది? సునీత, సౌభాగ్య మ్మలకు అవసరమైన భద్రత కల్పించాలి. బాబాయిని చంపిన నిందితులను చట్టానికి పట్టివ్వాలని జగన్‌కు లేదా?సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఈ కేసును సీబీఐకి ఎందుకివ్వలేదు. రాష్ట్రంలో పాలన గాడి తప్పింది.. పాలెగాళ్ల పద్ధతిలో సాగు తోంది' అని వర్ల రామయ్య ఆరోపించారు.

ఓటేసిన సీఈసీ, గాంధీ కుటుంబం, అద్వానీ

ఢిల్లీ, ఫిబ్రవరి 8: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. వివిధ రంగాల ప్రముఖులతో పాటు పౌరులు చురుగ్గా పోలింగ్‌లో పాల్గొంటున్నారు.

భారత ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలోని నిర్మాణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సీఈసీ ఓటేశారు. ఈ స్థానం నుండే ప్రస్తుత ఎమ్మెల్యే, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బరిలో ఉన్నారు. ప్రత్యర్థులుగా బీజేపీ నుంచి సునీల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నుంచి రమేశ్ సబర్వాల్ బరిలో ఉన్నారు. ఎలక్షన్ కమిషనర్ సుశీల్ చంద్రా తన భార్య నీలూ చంద్రాతో కలిసి న్యూ మోతీ బాగ్‌లో గల పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. అదేవిధంగా నిర్మాణ్ భవన్‌లో కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, లోదీ ఎస్టేట్‌లో ఆ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ, ఔరంగజేబు లేన్‌లో ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఓటేశారు. ఇది ఎంతో ముఖ్యమైన రోజు అని బద్దకంగా ఉండకుండా అర్హులైన ప్రతీఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనాల్సిందిగా ఈ సందర్భంగా గాంధీల కుటుంబం పేర్కొంది. బీజేపీ సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీ ఆయన కూతురు

ప్రతిభా అద్వానీ ఔరంగజేబు లేన్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు 15.68 శాతం పోలింగ్ నమోదైంది.

తెలంగాణ ప్రజలను అవమానించిన ప్రధాని

దివంగత సుష్మా స్వరాజ్‌కూ అవమానమే
ప్రధాని వ్యాఖ్యలపై మండపడ్డ మండలి ఛైర్మన్ గుత్తా

నల్లగొండ,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజలను, ఉద్యమాన్ని అవహేళన చేసే విధంగా మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ వైఖరిని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

లోక్‌సభలో ప్రధాని ప్రసంగంలో తెలంగాణ బిల్లును తలుపులు మూసి తెచ్చారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. శు క్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన గుత్తా బీజేపీ పూటకు ఒకలా మాట్లాడటం సరికాదన్నారు.

నాడు ప్రతిపక్ష నాయకు రాలిగా ఉన్న సుష్మా స్వరాజ్ మద్దతు ఇవ్వడం వలనే పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ అయ్యిందని గుర్తుచేశారు. ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలనే కాదు.. సుష్మా స్వరాజ్‌ని కూడా కించపరిచేలా మాట్లాడారని అన్నారు. అందరి ఏకాభిప్రాయంతోనే ఆనాడు తెలంగాణ ఏర్పడిందన్నారు. దీనిపై కావాలనే ప్రధాని వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. మోడీ ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాల న్నారు. నిజాలు తెలుసుకొని తెలంగాణ ప్రజలను గౌరవించేలా మాట్లాడితే మంచిందని హితవుచెప్పారు.

ఐసీయూలో దేశ ఆర్థిక వ్యవస్థ: పి.చిదంబరం

హైదరాబాద్, ఫిబ్రవరి 8: దేశ ఆర్థిక వ్యవస్థ ఐసీయూలో ఉందని కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం అన్నారు. ఏఐసీసీ నేతృత్వంలో నగరంలోని బంజారాహిల్స్‌లో గల ముఖకంజా కళాశాలలో కేంద్ర బడ్జెట్, దేశ ఆర్థిక వ్యవస్థపై సెమినార్ నిర్వహణ జరిగింది. ఈ సెమినార్‌కు మాజీ మంత్రి పి.చిద ంబరం హాజరయ్యారు. ఈ సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధి 8.5 శాతం నుంచి 5 శాతానికి పడిపోయిందన్నారు. ప్రతి వ్యవస్థ, విభాగం క్షీణదశలో ఉందన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలపై నోట్ల రద్దు తీవ్ర ప్రభావం చూపిందన్నారు. జీఎస్టీ మంచిదే అయినప్పటికే సరిగ్గా అమలు చేయలేకపోయారన్నారు. ఆహార, వ్యవసాయ రంగాలకు బడ్జెట్‌లో లక్ష కోట్ల కోత విధించారన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సైతం విస్మరించారన్నారు. నైపుణ్యాభివృద్ధిని కూడా గాలికొదిల శారన్నారు. అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతబడ్డాయని... ఆటోమొబైల్ సంస్థలు సంక్షోభంలోకి వెళ్లాయన్నారు. పెట్టుబడులు లేక దేశంలో ఉత్పత్తులు నిలిచిపోయాయన్నారు. పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకు రావడం లేదని ఆయన పేర్కొన్నారు.

భక్తులకు సేవలో ఆర్టీసీ ముందంజ

ఆదాయం కన్నా సేవపైనే దృష్టి
మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

మేడారం,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): అతి పెద్ద గిరిజన జాతరకు అశేష భక్త జనంను గమ్యస్థానం చేర్చడమే అర్‌టిసి లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మంత్రి సతీమణి పువ్వాడ వసంత లక్ష్మితో కలిసి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా మేడారం చేరుకొని వన దేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి మాట్లాడుతూ మేడారం జాతర కోసం ఇప్పటి వరకు 36 వెల ట్రిప్పులు 20 లక్షలకు పైగా భక్తులను గమ్యస్థానానికి చేర్చినట్లు చెప్పారు ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా భక్తులను సురక్షితంగా గమ్య స్థానం కు చేర్చడం జరిగిందని చెప్పారు. జాతరలో భక్తులకు ఇబ్బంది కలగకుండా అహర్నిశలు కష్ట పడి పనిచేసిన ఆర్టిసి ఉన్నతాధికారులు సిబ్బంది ఆర్టిసి కార్మికులు జాతరలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేసారు. జాతర సందర్భంగా ఆర్టిసికి ఆదాయం ఆశించించి ఆర్టిసి సేవలు చేయడం లేదని ప్రయాణికులను వారి వారి గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చడమే ప్రధాన ఉ ద్యేశ్యమని చెప్పారు. మేడారం సమ్మక్క – సారలమ్మలను దర్శించ ుకునేందుకు వచ్చిన కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండాకి, రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి లకు స్వాగతం పలికి, దర్శనం చేయించిన రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సీతక్క, అధికారులు. మేడారం జాతరను జాతీయ పండగ గా గుర్తించాలని, మేడారం అభివృద్ధికి నిధులు, గురుకులాలు కేటాయించాలని కోరుతూ కేంద్రమంత్రికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం పోచంపల్లి కండువాలు, శాలువా కప్పి, జ్ఞాపికను అందించి సన్మానం చేశారు.

మేడారంలో వనదేవతలను సందర్శించిన మంత్రి పువ్వాడ దంపతులు

హైదరాబాద్‌లో అమరావతి ఆందోళనలు

మేడారంలో మొక్కులు తీర్చుకోనున్న జెఏసి నేతలు

హైదరాబాద్,ఫిబ్రవరి8(ఆర్